తెలుగు జాతి మణిదీపం

జస్టిస్ నూతలపాటి వెంకట రమణ



9 ఆగస్టు, 2025న అవనిగడ్డ గాంధీక్షేత్రంలో



మండలి వెంకట కృష్ణారావు

తెలుగు వైభవ పురస్కార ప్రదానోత్సవం

సందర్భంగా...



తిరుమలలో కుటుంబ సభ్యులతో జస్టిస్ ఎన్.వి. రమణ

తెలుగు జాతి మణిదీపం

జస్టిస్ నూతలపాటి వెంకట రమణ

కూర్పు: **డా॥ జి. వి. పూర్ణచందు**

9 ఆగస్టు, 2025న అవనిగడ్డ గాంధీక్షేత్రంలో



మండలి వెంకట కృష్ణారావు

తెలుగు వైభవ పురస్కార ప్రదానోత్సవం

సందర్భంగా...

ప్రచురణ

మండలి ఫౌండేషన్
MANDALI FOUNDATION

మండలి ఫౌండేషన్

అవనిగడ్డ, కృష్ణాజిల్లా - 521121

తెలుగు జాతి మణిదీపం

జస్టిస్ నూతలపాటి వెంకట రమణ

కూర్పు: **డా॥ జి. వి. పూర్ణచందు**

TELUGU JAATI MANIDEEPAM

JUSTICE NUTALAPATI VENKATA RAMANA

Edited by: **Dr. G. V. Purnachand**

మండలి వెంకట కృష్ణారావు

తెలుగు వైభవ పురస్కార ప్రదాన సందర్భంగా

వెలువరిస్తున్న

జస్టిస్ రమణగారి జీవిత పరిచయ గ్రంథం



మొదటి ముద్రణ : ఆగష్టు 09, 2025

ప్రతులు : 1,000

వెల: : అమూల్యం

ప్రచురణ:

మండలి ఫౌండేషన్

గాంధీక్షేత్రం, అవనిగడ్డ – 521 121

కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్

ముద్రణ:

రైతునేస్తం ప్రెస్

ప్లాట్ నెం. 17, ఐడిఏ బాలానగర్,

హైదరాబాద్ – 500 037.

ఫోన్: 7416045979

ధర్మగర్జన చేసిన న్యాయమూర్తి

జస్టిస్ యన్. వి. రమణ

నూతలపాటి వెంకటరమణ...
విత్తనాల్ని చేతబట్టి నేలలో నమ్మకం నాటిన ఒక గ్రామీణుడు...
మట్టిలో తడిసిన రైతుబిడ్డ...

తెలుగు తల్లి ఒడిలో ఒలికిన అక్షరాలే అతని మొదటి పాఠాలు. తెలుగుభాషల మమకారమే అతని తొలి లక్ష్యాలు.

కృష్ణాజిల్లా వీరుళ్లపాడు తహసీల్లోని పొన్నవరం – బంగారం లాంటి ఊరి నీరు తాగి పెరిగాడు.

పత్రికా రంగంలో కాలాన్ని పదిలంగా గడిపిన యువకుడు... కొనసాగి ఉంటే బహుశా ఓ పత్రికకు సంపాదకుడయ్యే వాడేమో... తెలుగుతల్లి ఆకాంక్షలు వేరే ఉన్నాయి... దేశానికి, న్యాయానికి, చట్టానికి ఆయన ద్వారా ఒనగూరవలసినవెన్నెన్నో...

ప్రజల పలుకులకు ప్రభుత్వ బాధ్యతను గుర్తెరిగించే బాధ్యత వహించటం ఆయనకు ముఖ్యం...

తండ్రి ఆయనను న్యాయ శాస్త్రంలో చేరమని కోరాడు... తండ్రిమాట జవదాటని రాముడు ఈ యువ రమణుడు!

ఒక్క నిర్ణయం జీవితాన్నే మార్చేస్తుంది... ఆ నిర్ణయం సరైనదని నమోదైన విజయాలే నిరూపిస్తాయి!

న్యాయవాదిగా మొదలైన ప్రయాణం, న్యాయమూర్తిగా పరిపక్వతకు చేరుకుంది. అనంతరం, హైకోర్టు ధర్మాసనం మీద న్యాయం ఒలికించాడు. కృష్ణమ్మ ఒడిలో పెరిగిన ఆ యువకుడు, భారత ప్రధాన న్యామూర్తిగా ఎదిగాడు!

నిరంతర ధ్యానం, ప్రజల పట్ల నిబద్ధత, న్యాయవ్యవస్థ పట్ల విశ్వాసం – ఇవే ఆయన విజయాలకు పునాదులు.

బిల్కిస్ బానో కేసు, గృహిణుల విలువపై తీర్పు, పార్టీలు మారే రాజకీయ దళారులపై కన్నెర్ర, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల సంబంధాలు సంప్రదింపుల ద్వారా నడవవలసినవిగా నిర్వచించటం వంటి అనేక చారిత్రక తీర్పులు, రాజ్యాంగ సమతుల్యతకు అద్దం పట్టేవి. అవి న్యాయమూర్తిగా ఆయన మానవీయతను, సమదార్శనికతను, సమాజ నిష్ఠను చాటి చెప్పాయి.

నిర్ణయాల వెనుక ఉన్న తాత్వికత, తీర్పుల్లో దాగిన మానవీయత, భాషపై చూపిన అనురక్తి – ఇవన్నీ కలిస్తే ఒక ధర్మగర్జన. అదే జస్టిస్ ఎన్వీ రమణ.

న్యాయదేవత పట్ల ఆరాధన ఒక వైపు తెలుగు తల్లి పట్ల భక్తి, అనురాగం, ఆత్మీయతలు వేరొక వైపు... ప్రజలకు న్యాయం అర్థం కావాలన్న లక్ష్యానికి ఆయన్ని పురికొల్పాయి! మనిషికి, న్యాయానికి మధ్య వారధి, భాష... అనేది ఆయన భావన!

ఈ మట్టిపై ఎదిగి, మెట్టు మెట్టు పైనా న్యాయతేజంగా వెలిగి, ధర్మగర్జన చేసిన రైతుబిడ్డ జస్టిస్ రమణగారికి 'దివిసీమ గాంధీ, భాషాత్రాణపరాయణ కీ.శే. మండలి వెంకటకృష్ణారావు' పురస్కారం అందించడమంటే – జ్ఞానానికీ, న్యాయానికి, ప్రజాస్వామ్య ధర్మానికీ, ప్రజల భాషకీ అందించిన ఘనమైన బహుమతి!!

వారి భావి సమయం, మేథ, సంకల్పాలన్నీధర్మ పరిరక్షణకు, సామాజిక పరివర్తనకు, భాషాపరిరక్షణకు కంకణ ధారిగా సాగాలని ఆకాంక్షిస్తున్నాం.

మండలి బుద్ధప్రసాద్
అధ్యక్షులు, మండలి ఫౌండేషన్



శ్రీకాకుళంలో శ్రీకృష్ణదేవరాయ మహోత్సవాలు ప్రారంభిస్తున్న జస్టిస్ రమణ దంపతులు, సిరివెన్నెల సీతారామశాస్త్రి, మండలి బుద్ధప్రసాద్



దక్షత, దీక్షత ప్రదర్శించిన న్యాయమూర్తి

- ఎ. కృష్ణారావు

దేశ రాజధానిలో తెలుగువారి కీర్తి పతాకను రెపరెపలాడించిన అతి కొద్ది మందిలో మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకట రమణ ఒకరు. జస్టిస్ కోకా సుబ్బారావు భారత ప్రధాన న్యాయమూర్తి అయిన 55 సంవత్సరాలకు అత్యంత కీలక సమయంలో రెండవ తెలుగు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ రమణ న్యాయవ్యవస్థపై చెరగని ముద్ర వేశారు. కృష్ణా జిల్లాలోని పొన్నవరంలో ఒక సాధారణ రైతు కుటుంబంలో 1957 ఆగస్టు 27న జన్మించిన ఎన్ వి రమణ తండ్రి అభీష్టం మేరకు బలవంతం మీద లా చదివి న్యాయవాద వృత్తిలో చేరారే కాని విద్యార్థి దశ నుంచి ఆయన దృష్టి రాజకీయాలపైనే ఉండేది. కాని ఏ పని చేపట్టినా దానికి పూర్తి న్యాయం చేయడం రమణ గారి నైజం. న్యాయశాస్త్రంలో పట్టా పుచ్చుకున్నాక 1983 ఫిబ్రవరి 10న న్యాయవాదిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బార్‌లో పేరు నమోదు చేయించుకుని ప్రాక్టీసు మొదలెట్టారు. కేంద్ర, రాష్ట్ర అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్స్‌లోనూ, సుప్రీంకోర్టు సహా అనేక కోర్టుల్లోనూ చాలా సివిల్, క్రిమినల్ కేసులను వాదించారు. రాజ్యాంగ చట్టాలపై కూడా పట్టు సాధించారు. అంతర్రాష్ట్ర జలవివాదాలు, ఎన్నికల వ్యవహారాలు, టాక్సేషన్, ఆర్బిట్రేషన్, సర్వీసు అంశాల వరకు ఆయన అనేక కేసుల్లో వాదించారు. రైల్వేలకు కొంతకాలం స్టాండింగ్ వకీలుగా, రాష్ట్ర ప్రభుత్వం తరపున అదనపు అడ్వకేట్ జనరల్‌గా వ్యవహరించారు. 2000 జూన్ 27న ఆయన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. ఆ సమయంలో లైంగిక దాడులను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై జస్టిస్ వర్మ కమిషన్‌కు ఆయన ఇచ్చిన సిఫారసులు సీఆర్‌పిసీలో సవరణలకు దారి తీశాయి. దిగువ కోర్టు జడ్జిలకు నిరంతర శిక్షణ అవసరమని నమ్మే జస్టిస్ రమణ హైకోర్టు న్యాయమూర్తిగా ఉండగానే దేశంలోనే మొట్టమొదటి న్యాయాధికారుల సదస్సు నిర్వహించారు. పోలీసు ఉన్నతాధికారులు, సామాజిక సేవా ప్రముఖులు, లాయర్లు, ఇతర రంగాల నిపుణులు అందులో పాల్గొన్నారు. అనేక జాతీయ, అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్నారు. అనేక పత్రాలు సమర్పించారు. బ్రిటన్, అమెరికా పర్యటించి అక్కడి న్యాయవ్యవస్థను అధ్యయనం చేశారు. తీర్పులు ప్రాంతీయ భాషల్లో ఉండాలని, గ్రామీణులకు చేరువగా న్యాయపాలిక ఉండాలని తపించారు. ఈ క్రమంలోనే ఆయన అంచెలంచెలుగా ఎదుగుతూ ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా, చివరకు సుప్రీం ప్రధాన న్యాయమూర్తిగా అత్యున్నత స్థానానికి చేరుకున్నారు.

న్యాయవ్యవస్థలో సంస్కరణలు తేవాలని నిరంతరం తపించే జస్టిస్ ఎన్.వి. రమణ న్యాయవ్యవస్థలో ఖాళీలను వేగంగా పూర్తించారు. ఆయన హయాంలోనే గతంలో ఎన్నడూ లేని విధంగా సుప్రీంకోర్టులో నలుగురు మహిళా న్యాయమూర్తులు బాధ్యతలు నిర్వహించారు. న్యాయవ్యవస్థలో సామాజిక న్యాయం కోసం ఆయన తీవ్ర యత్నాలు చేసి వివిధ వర్గాలకు చెందిన వారికి అవకాశం కల్పించారు. ప్రత్యామ్నాయ వివాద పరిష్కార యంత్రాంగం కోసం



తీవ్ర కృషి చేశారు. హైదరాబాద్‌లో ఆర్బిట్రేషన్ సెంటర్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. న్యాయవ్యవస్థలో టెక్నాలజీని వినియోగించి ప్రజలకు వేగంగా న్యాయం అందించాలని, బెయిల్ లభించిన రోజే ఖైదీలు విడుదలయ్యేలా చూడాలని చెప్పారు. అందుకోసం ఫాస్టర్ అనే వ్యవస్థను ప్రవేశపెట్టారు. ప్రాంతీయ భాషల్లో తీర్పులు రావాలని, నిమ్న వర్గాలకు న్యాయం వేగంగా అందాలని ఆయన ఎన్నోసార్లు చెప్పారు.

ముఖ్యంగా మానవ హక్కుల విషయంలో ఆయన ఎప్పుడూ రాజీ పడలేదు. కాలం చెల్లిన రాజద్రోహం పేరుతో ఈ నాటికీ అరెస్టులు చేయడాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. మహాత్మాగాంధీ, బాలగంగాధర్ తిలక్ వంటి స్వాతంత్ర్య సమరయోధుల్ని అరెస్టు చేసేందుకు ఉపయోగించిన రాజద్రోహనేరాన్ని దుర్వినియోగం చేస్తున్న తీరును ఆయన ప్రశ్నించారు. వలసకాలపు చట్టాన్ని ప్రజాస్వామ్య భారతంలో ప్రయోగించడం, జర్నలిస్టులను, క్రియాశీల కార్యకర్తల్ని, అసమ్మతి తెలిపేవారిని అరెస్టు చేయడంపై 2021లో జస్టిస్ రమణ ఆందోళన వ్యక్తం చేశారు. దీనితో సెక్షన్ 124 (ఏ)ను పునఃపరిశీలిస్తామని ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. భారత న్యాయసంహితలో ఈ సెక్షన్‌ను తొలగించింది.

నేరచరితులన్న పేరుతో బుల్ డోజర్‌తో వారి ఇళ్లను కూల్చి వేయడానికి కూడా ఆయన అడ్డుకట్ట వేశారు. ప్రభుత్వం న్యాయాన్ని తన చేతుల్లోకి తీసుకోకుండా చూశారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా, ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ రమణ ఎన్నో కీలక తీర్పులు ఇచ్చారు. మచ్చుకు కొన్ని...

- ఇంట్లో మహిళ చేసే పని ఆఫీసుకు వెళ్లి భర్త చేసే పని కంటే ఏ మాత్రం తక్కువ కాదు. నష్టపరిహారాలిచ్చే విషయంలో మహిళకే ప్రాధాన్యం ఇవ్వాలి.
- జమ్మూ కశ్మీర్‌లో టెలికాం, ఇంటర్నెట్ సేవలపై విధించిన నిషేధాన్ని సమీక్షించి వారంలోగా వాటిని పునరుద్ధరించాలి.
- సమాచార హక్కు పరిధిలోకి సీజే కార్యాలయంను కూడా చేర్చాలి.
- ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకునే సరుకులపై ఎంట్రీ టాక్స్ విధించే అధికారం రాష్ట్రాలకుంది.
- స్పీకర్‌ను, ముఖ్యమంత్రిని, మంత్రివర్గాన్ని సంప్రదించకుండా అసెంబ్లీ సమావేశాలను ముందుకు జరిపే లేదా వాయిదా వేసే అధికారం గవర్నర్లకు లేదు.
- ఆగమ శాస్త్ర నియమాల ప్రకారం ఆలయాల్లో అర్చకులను నియమించుకోవచ్చు. ఇందులో నిర్దేశిత నిబంధనలు, రాజ్యాంగ సూత్రాల ఉల్లంఘన జరగరాదు.
- జీవించే హక్కు, స్వేచ్ఛగా ఆలోచించే హక్కు, తన ప్రైవసీని కాపాడుకునే హక్కు ప్రతి పౌరుడికీ ఉన్నది. జాతీయ భద్రత పేరిట వాటిని ఉల్లంఘించడం సరైంది కాదు.
- విచారణ దశలో ఉన్న ఖైదీలకు కూడా జీవించే హక్కు వర్తిస్తుంది. వారికి వైద్య సౌకర్యాలు కల్పించాలి. జర్నలిస్టు కప్పన్‌కు జస్టిస్ రమణ మూలంగా వైద్య చికిత్స లభించింది.



- న్యాయమూర్తులు నిర్భయంగా తమ విధులను నిర్వహించేందుకు తోడ్పడినప్పుడే ప్రజాస్వామ్యం ఆరోగ్యకరంగా ఉంటుంది. ధన్‌బాద్‌లో ఒక న్యాయమూర్తి ఆటో ఢీకొని మరణించిన తీరుపై జస్టిస్ రమణ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయమూర్తులకు రక్షణ కల్పించడంలో పోలీసులు, సిబిఐ సహకరించడం లేదని ఆయన స్పష్టంగా ప్రకటించారు.
- న్యాయవ్యవస్థ సరిగా పనిచేయాలంటే మెరుగైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలి. మౌలిక సదుపాయాలకు ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేసి అన్ని న్యాయస్థానాలకు పక్కా భవనాలు, ఆధునిక సౌకర్యాలు కల్పించాలని ప్రతిపాదన చేశారు.
- ట్రిబ్యునల్స్‌లో ఖాళీలను వేగంగా పూర్తించి సత్వర న్యాయం అందేలా చూడాలి. ట్రిబ్యునల్స్ ఖాళీలను పూరించకపోవడంపై ప్రభుత్వంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.
- ఇంటర్నెట్ సౌకర్యాలు లేకపోతే భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను అరికట్టినట్లే. కశ్మీర్ లోయలో కూడా ఇంటర్నెట్ ను పునరుద్ధరించాలి.
- రాజకీయ పార్టీల బలాబలాలు రాజ్‌భవన్‌లో కాదు... శాసన సభలోనే తేలాలి. జస్టిస్ రమణ తీర్పుతో మహారాష్ట్రలో రాత్రికి రాత్రి ఏర్పడ్డ ప్రభుత్వం గద్దె దిగాల్సి వచ్చింది.
- నేరచరితులైన ప్రజా ప్రతినిధులపై కేసుల విచారణ వేగవంతంగా జరగాలి. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పర్యవేక్షణలో ఈ విచారణ సాగాలి.

జస్టిస్ రమణ తన హయాంలో ప్రజలకు న్యాయాన్ని అందుబాటులో తెచ్చేందుకు ఎంతో తోడ్పడ్డారని ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవికి ఎంపికైన జస్టిస్ బిఆర్ గవాయి ప్రశంసల వర్షం కురిపించడమే ఆయన పనితీరుకు నిదర్శనం. జస్టిస్ రమణను ఆయన ప్రజల న్యాయమూర్తిగా అభివర్ణించారు. ప్రజలకు దూరంగా ఏకాకుల్లా ఉండకుండా న్యాయమూర్తులు ప్రజల మధ్య ఉండాలని జస్టిస్ రమణ తపించారని పేర్కొన్నారు.

జస్టిస్ రమణ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా అత్యంత సమర్థత కనపరిచారని ఇందిరా జై సింగ్, ఉపేంద్ర బక్షి వంటి న్యాయకోవిదులు కూడా ప్రశంసించారు. ప్రజలకు ఏది సరైనదో అదే జస్టిస్ రమణ చేశారని ఇందిరా జై సింగ్ అన్నారు. ఒక హుందాతనంతో, సాహసంతో, పట్టుదలతో ఆయన న్యాయవ్యవస్థను నిర్వహించారని ఉపేంద్ర బక్షి అన్నారు. ఆయనలో సంస్థాగత నాయకత్వం, న్యాయపరమైన నాయకత్వం, రాజ్యాంగాన్ని అన్వయించే శక్తి అపారమని ఆయన చెప్పారు. జస్టిస్ రమణ అత్యంత సమతుల్యంగా వ్యవహరించారని సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే ఆయన పదవీ విరమణ సందర్భంగా కంటనీరు పెట్టుకుంటూ అన్నారు. దేశ వ్యాప్తంగా వందలాది మంది న్యాయమూర్తులు, న్యాయవాదులు జస్టిస్ రమణ నాయకత్వాన్ని ప్రశంసిస్తూ సందేశాలు పంపారు. ఆయనపై రాజకీయ కుట్రలు జరిగినప్పుడు కూడా మొత్తం న్యాయవ్యవస్థ, మేధావి వర్గం ఆయనకు బాసటగా నిలిచింది. ఆయన పరిపాలనా దక్షత న్యాయదీక్ష చరిత్రలో చెరిగిపోలేనిది.

★ ★ ★



రమణ గారి న్యాయప్రస్థానం

- డా॥ జి. వి. పూర్ణచందు

భారత అత్యున్నత న్యాయస్థానానికి 48వ ప్రధాన న్యాయమూర్తిగా ఎంపికైన జస్టిస్ రమణగారు ప్రధాన న్యాయమూర్తిగా అధిరోహించిన ప్రయాణక్రమం ఇలా సాగింది:

24 ఏప్రియల్ 2021 నుండి 26 ఆగస్టు 2022 దాకా రమణగారు భారత ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు.

ఆనాటి రాష్ట్రపతి శ్రీ రామనాథ్ కోవింద్ రమణగారి చేత ప్రమాణ స్వీకారం చేయించగా, వారి తరువాతి 15వ రాష్ట్రపతిగా ఎన్నికైన శ్రీమతి ద్రౌపది ముర్మూ గారి చేత జస్టిస్ రమణగారు ప్రమాణ స్వీకారం చేయించారు.

అప్పటి వరకూ భారత ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ శరద్ అరవింద్ బాబ్డే తన వారసుడిగా జస్టిస్ రమణగారి పేరును సూచించారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ రమణగారి నియామకం ఫిబ్రవరి 17, 2014న జరిగింది. ఆయన ఆ పదవిలో 23 ఏప్రియల్ 2021 వరకూ కొనసాగి ఏప్రియల్ 24న భారత ప్రధాన న్యాయమూర్తి పదవిని అధిరోహించారు. వారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ పి. సదాశివం నామినేట్ చేయగా, నాటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీగారు నియమించారు.

అంతకు మునుపు ఢిల్లీ హైకోర్టు 27వ ప్రధాన న్యాయమూర్తిగా ఆయన 2013 సెప్టెంబరు 2న నియమితులయ్యారు. సదాశివం గారే వారి పేరుని ప్రతిపాదించగా, ప్రణబ్ ముఖర్జీగారు నియామకం చేశారు. 16 ఫిబ్రవరి 2014 వరకూ ఆపదవిలో కొనసాగారు. ఫిబ్రవరి 17 నుండీ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు.

నూతన మిలీనియం 2000 సంవత్సరం నుండి న్యాయమూర్తిగా ఆయన న్యాయ ప్రస్థానం ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా 27 జూన్ 2000న ఆయన నియామకం జరిగింది. 1 సెప్టెంబరు 2013 దాకా ఆయన ఆ పదవిలో కొనసాగారు. 2013 మార్చి 10 నుండి సెప్టెంబరు 1 దాకా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సన్నాహక (యాక్టింగ్) ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించారు. ఆ తరువాత ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఎంపికయ్యారు.

1980లో లా కాలేజీలో చేరకముందు, రమణగారు రెండేళ్లపాటు ఈనాడు దినపత్రికలో జర్నలిస్టుగా పనిచేశారు. 1983లో అడ్వొకేట్‌గా బార్‌లో నమోదు అయ్యారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్, **AP** స్టేట్ ట్రిబ్యునల్, సుప్రీంకోర్టు తదితర న్యాయస్థానాలలో సివిల్, క్రిమినల్, రాజ్యాంగ, ఉద్యోగ, ఎన్నికల వ్యవహారాలలో





సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా....



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం



ప్రావీణ్యం కలిగి పనిచేశారు. ముఖ్యంగా: ఇంటర్ స్టేట్ నదుల చట్టాలమీద ఆయనకు అపారమైన అనుభవం ఉంది.

దేశంలో కరోనా మహమ్మారి తీవ్రంగా ఉన్న తరుణంలో భారత ప్రధాన న్యాయమూర్తిగా (CJI) బాధ్యతలు స్వీకరించారు. లాక్‌డౌన్ లాంటి పరిస్థితుల కారణంగా అప్పటివరకు, సుప్రీంకోర్టు పరిమిత సామర్థ్యంతో పనిచేస్తోంది. వివాదాల పెండింగ్ సంఖ్య గణనీయంగా పెరిగింది. దీనితో పాటు, ఆయనకు సుప్రీం కోర్టులో 6 ఖాళీలను, అలాగే హైకోర్టుల్లో సుమారు 230 శాశ్వత న్యాయమూర్తుల పదవులు ఖాళీగా ఉన్నాయి. ఈ సంక్షోభ సమయంలో న్యాయవ్యవస్థ సామర్థ్యాన్ని పునర్నిర్మించడానికి, ఖాళీల భర్తీ ద్వారా వ్యవస్థకు స్థిరత్వం చేకూర్చడానికి జస్టిస్ రమణగారు సుప్రీంకోర్టు వ్యవహారాలను వేగపరచే కృషి ప్రారంభించారు. ఎంతో క్రియాశీలంగా వ్యవహరించారు.

రమణగారు భారత ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన 16 నెలల కాలంలో కోర్టు భౌతికంగా కేవలం 55 రోజులే సమావేశమైందంటే, ఆనాటి పరిస్థితిని ఊహించుకోవచ్చు! పెనుసవాళ్లను అనితరసాధ్యమైన రీతిలో విజయాలుగా మలచుకుని సుప్రీంకోర్టు పని విధానానికి నూతన జవసత్వాలందించటం ద్వారా సామాన్యుడికి న్యాయం అనే సిద్ధాంతం అమలుకు విశేష కృషి చేశారాయన.

అధ్యాత్మిక, పరిపక్వతతో వ్యవహరించే ఆయన నెమ్మదిగా, ప్రణాళికాబద్ధంగా ముఖ్యంగా న్యాయ పరిపాలనా రంగంలో ఉన్న అనేక సమస్యలను పరిష్కరించారు. 250కి పైగా హైకోర్టు న్యాయమూర్తుల నియామకాలకు సిఫార్సు చేసి న్యాయమూర్తుల ఖాళీలను గణనీయంగా తగ్గించగలిగారు. 2016 తర్వాత తొలిసారిగా ఖాళీ న్యాయమూర్తుల సంఖ్య అత్యల్ప స్థాయికి చేరుకోవడం ఆయన పరిపాలన విజయాన్ని సూచిస్తుంది.

2021 ఆగస్టులో సుప్రీంకోర్టుకు తొమ్మిది మంది న్యాయమూర్తుల నియామకం జరిపారు. వారిలో ముగ్గురు మహిళలు ఉండగా, జస్టిస్ బీవీ నాగరత్న దేశ తొలి మహిళా సీజేఐగా బాధ్యతలు చేపట్టనున్నారు. **FASTER** అనే డిజిటల్ వ్యవస్థను ప్రవేశపెట్టడం ద్వారా సుప్రీంకోర్టు తాత్కాలిక ఉత్తర్వులు, బెయిల్ ఉత్తర్వులు తదితరాలను సంబంధిత అధికారులకు వేగంగా, భద్రంగా పంపే విధానాన్ని అమలులోకి తీసుకొచ్చారు.

కోవిడ్ అనంతరం ఈ–ఫైలింగ్ మరియు హైబ్రిడ్ హియరింగ్ విధానాలను శాశ్వతంగా కొనసాగించారు.

సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్‌కు ఆడిటోరియం వినియోగం అనుమతించడంతో పాటు, న్యాయవాదులకు కొత్త చాంబర్లు కేటాయించడం వంటి నిర్ణయాలు వకీల్ సమాజానికి విశేషంగా నచ్చాయి.

మీడియాకు ప్రత్యేకంగా ఆన్‌లైన్ ద్వారా కోర్టు విచారణల్లో హాజరు కావడం అనుమతించడం ద్వారా కోర్టు వ్యవహారాల్లో పారదర్శకతను పెంపొందించారు.



రైతుబిడ్డగా ప్రారంభమైన ఆయన జీవితమూ, పోరాటయోధుడిగా ఎదిగిన ఆయన బాల్య యౌవనాలు, న్యాయానికి కట్టుబడాలనే లక్ష్యంతో మొదలైన న్యాయవాద జీవితమూ, చిత్రవిచిత్ర మలుపులతో పరమపద సోపాన పఠంలా సాగిన న్యాయవాద వృత్తి చివరికి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, భారతదేశ న్యాయమూర్తిగా పండిన వైనాన్ని, ఆ పదవికి ఆయన వన్నెతెచ్చిన విశేషాలను ఈ లఘుగ్రంథం కళ్లకు కడ్తుంది. ఆయన వ్యక్తిత్వాన్ని సమున్నతంగా చిత్రించిన ఈ పుస్తకం స్ఫూర్తిదాయకం కాగలదని నమ్ముతున్నాం!

అలాగే, ములుగు రాజద్రోహ చట్టాన్ని (సెడిషన్ లా) తాత్కాలికంగా నిలిపివేయడం వంటి ముఖ్యమైన న్యాయపరమైన నిర్ణయాలు తీసుకున్నారు.

"Democracy: Role and Responsibilities of Investigative Agencies" అనే ఉపన్యాసంలో, బ్రిటిష్ కాలం నుంచి పోలీస్ వ్యవస్థ అభివృద్ధి, CBI విశ్వసనీయతపై ప్రజల సందేహాలు, రాజకీయ – పాలనా వ్యవస్థతో ఉన్న సంబంధాన్ని దూరం చేయాలని ఆయన సూచించారు. నేరపరిశోధనా సంస్థలకు స్వతంత్ర ప్రతిపత్తిని చట్టం ద్వారా ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు

జాతీయ న్యాయ సేవా సంస్థల సమావేశంలో మాట్లాడుతూ, దేశంలో కొద్దిపాటి ప్రజలు మాత్రమే కోర్టులు చేరగలుగుతారని, చాలా మంది నిశ్శబ్దంగా బాధపడుతున్నారని, న్యాయ ప్రాప్తిని సామాజిక విముక్తి సాధనంగా గ్రహించాలని ఆయన అన్నారు. జిల్లా న్యాయవ్యవస్థలను బలోపేతం చేయాలని, విచారణలో ఉన్న ఖైదీల హక్కుల కోసం న్యాయవాదులు, న్యాయమూర్తులు చొరవ చూపాలని ఆయన కోరారు.

రాజస్థాన్ శాసనసభలో ప్రసంగిస్తూ, అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య పరస్పర గౌరవం లేకుండా పోయిందని, చట్టసభలలో ప్రతిపక్ష స్థలం తగ్గిపోతోందని, ఇది ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య సూచిక కాదనీ అన్నారు. చట్టాలు స్పష్ట చర్చలతోనే ఆమోదించబడాలని ఆయన అభిప్రాయపడ్డారు.

2022 ఏప్రిల్‌లో పదవీ విరమణకు ముందు, భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, న్యాయవిధి నుంచి తప్పుకోవడం అంటే ప్రజాజీవితానికి దూరమవడం కాదని స్పష్టం చేశారు. అప్పట్లో తన దినచర్య తీవ్రంగా వుండటంతో, పదవీవిరమణ అనంతర కార్యచర్యాలపై దృష్టిపెట్టలేకపోయానని పేర్కొన్నారు. అయితే, తన సామాజిక, మేధో ప్రస్థానాన్ని కొనసాగించే సంకల్పాన్ని ఆయన విస్పష్టంగానే ప్రకటించారు.

2022 జూన్‌లో ఆయన తన జీవిత చరిత్ర రాయాలని సంకల్పించుకున్నట్టు ప్రకటించారు. అందులో ఒక ముఖ్య విభాగం, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుతో తన అనుబంధంపై కేంద్రీకృతమవుతుందని తెలిపారు. ఒక వేళ ఆనాడు ఆయన రాజకీయ ప్రవేశం జరిగి ఉంటే, సున్నిత మనస్కులు మృదుస్వభావీ అయిన రమణగారు ఎంతవరకూ ఈ కాలపు రాజకీయాలలో



ఇమడగలరనేది సందేహమే! కానీ దేశ అత్యున్నత న్యాయమూర్తి పదవిని అధిష్ఠించిన రెండవ తెలుగు వాడు రావటానికి ఇంకా చాలా కాలం పట్టి ఉండేది.

2022 జూలై 28న, పదవీ విరమణకు ఒక్కరోజు ముందు, భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ న్యాయవాదులకు ఒక సలహా ఇచ్చారు:

“దయచేసి అరవడాన్ని ఆశ్రయించకండి. అరవడం మీ ఆరోగ్యానికి హానికరం, కేసులో మాత్రం ఎలాంటి మార్పు తీసుకురాదు. మేము దక్షిణ భారతదేశం నుండి వచ్చిన న్యాయమూర్తులం ః అరవడం జరిగితే భయపడతాం. ఎందుకంటే ఒక కేసుకి నిజమైన బలం లేకపోతేనే అలాంటి అరుపులు వస్తాయనిపిస్తుంది.” అది ఆయన సున్నిత స్వభావాన్ని చాటుతుంది.

మరో మహాయజ్ఞం తెలుగులో తీర్పులు

1-8-1795... ఇప్పటికి రెండొందల ముప్పై యేళ్లనాటి సంగతి. ఆనాటి మచిలీపట్టణం జిల్లా కలెక్టర్ ‘జె ర్యాంఘామ్...” అనే ఆంగ్లేయుడు ఇంగ్లీషులో అర్జీలు ఇవ్వొద్దని తెలుగులో ఇస్తేనే పరిశీలిస్తానని ప్రకటించాడు. ఆంగ్లంలో వ్యవహారాలు నడపటం వలన మూడో వ్యక్తి ప్రమేయం పెరిగిపోయి, నిజాలు మరుగున పడే ప్రమాదం ఉందని ఆయన గమనించాడు.

వీరయ్య అనే వ్యక్తి ఆంగ్లంలో అర్జీ ఇచ్చిన కారణంగా తిరస్కరించాడు. న్యాయపాలనలో మాతృభాష ప్రాధాన్యతను మొదటగా గుర్తించిన వాడీ ఆంగ్లేయాధికారి. నూటికో కోటికో ఒక్కడుంటాడు ర్యాంఘాం లాంటి అధికారి. “మీరంతా న్యాయంకోసం నా భాష నేర్వాల్సిన అవసరం లేదు, నేనే మీకు న్యాయం చేయటం కొసం మీ భాష నేర్చుకుంటాను” అన్నాడు ర్యాంఘామ్.

1797లో రావణ దమ్మీయం అనే కావ్యాన్ని వ్రాసిన పిండిప్రోలి లక్ష్మణ కవి మేనల్లుడు మంగన్న దత్తతను శంకరమంచి అనంత పంతులు” అనే న్యాయాధికారి చెల్లదని తీర్పు ఇచ్చాడు. “...విత్తవాంఛ చే/దత్తు నదత్తుఁడంచను నధార్మిక పండితుఁడుంట యొప్పునే?’ ’ దొర ఆ అప్పీలులో ప్రశ్నించాడు. డబ్బు కక్కుర్తి పడి దత్తుణ్ణి అదత్తుడిగా ప్రకటించిన వ్యక్తి ధర్మపండితుడి స్థానంలో ఉండదగునా అని ప్రశ్నిస్తూ పద్య రూపంలో అప్పీలు తయారు చేసి పై కోర్టుకు వెళ్ళాడు లక్ష్మణకవి.

ఆ సమయంలో పైకోర్టులో న్యాయాధికారిగా ఉన్న సిపి బ్రౌను దొర పిండిప్రోలు లక్ష్మణకవి చేసిన వాదనని చదివి ఈ కేసును తాను విచారణకు స్వీకరిస్తున్నట్టు ప్రకటించాడు. వెంటనే తప్పుడు తీర్పునిచ్చిన న్యాయాధికారి తనకు లంచం ఇచ్చిన దాయాదుల్ని పిలిచి కోర్టు బయట ఈ విషయాన్ని పరిష్కరించుకోవలసిందని, లేకపోతే వాళ్లతో పాటు తానుకూడా మునుగుతానని మొత్తుకున్నాడు. మొత్తం మీద బ్రౌన్ విచారించకుండానే ఆయన కోర్టులో మంగన్నకు న్యాయం జరిగింది.



మాతృభాషలో తీర్పుల గురించి జస్టిస్ రమణగారు ప్రత్యేక శ్రద్ధ చూపించినప్పుడు ఈ రెండు సంఘటనలు మనసులో మెదిలాయి. ఇంగ్లీషే శరణ్యం అనే భావనలోంచి బైటకొచ్చి చూస్తే, అన్ని మాతృభాషలకూ న్యాయపాలనలో భాగస్వామ్యం అయ్యే అవకాశం కళ్లకు కడుతుంది.

ఇంగ్లీషు వాళ్లకన్నా ఇంగ్లీషు చదువుకున్న వారి ఆర్భాటం ఎక్కువగా ఉంది.



మచిలీపట్నం కలెక్టర్‌గా ఉన్నప్పుడు సిపి బ్రౌన్ స్వయంగా తెలుగులోనే తీర్పులు ఇచ్చారు. అవిభక్త మద్రాసు రాష్ట్రంలో న్యాయస్థానాల్లో తెలుగు ఉపయోగించాలని ఆనాటి మద్రాస్ హైకోర్టు సూచించింది.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాతే తెలుగులో తీర్పులు ఆగిపోయాయి! సినిమాల్లో కోర్టు సీన్లన్నీ తెలుగులోనే ఉంటాయి. తెలుగులోనే తీర్పులు చెప్తారు. కానీ నిజానికొచ్చేసరికి తెలుగు కరిమింగిన వెలగ అవుతుంది!

జస్టిస్ రమణగారు న్యాయపాలనలో స్థానిక భాష ప్రాధాన్యత గురించి విశేష కృషిచేశారు. “న్యాయవ్యవస్థలో అందరికీ అవకాశం కల్పించడం అత్యంత ముఖ్యం. న్యాయవ్యవస్థ కానీ, ప్రజాస్వామ్యంలోని మిగతా వ్యవస్థలు కానీ దేశ సామాజిక భౌగోళిక వైవిధ్యానికి అద్దం పట్టేలా ఉండాలి. హైకోర్టు కార్యకలాపాల్లో బారతీయ భాషలను ప్రవేశపెట్టాలని కోరుతూ నాకు ఎన్నో విజ్ఞపనలు వస్తున్నాయి. ఆ డిమాండును పరిశీలించాల్సిన సమయం ఆసన్నమైంది” అన్నారాయన.

న్యాయవ్యవస్థ ప్రజల విశ్వాసం చూరగొనాలంటే ఆ వ్యవస్థ వారికోసమే ఉన్నదన్న నమ్మకం ప్రజలలో కలిగించాలి. సుదీర్ఘ కాలం ఈ దేశంలో అణగారిన ప్రజలకు న్యాయవ్యవస్థ అందుబాటులో లేదు. కోర్టుల తలుపు తట్టేందుకు సామాన్యుడు భయపడని వాతావరణం రావాలి” అన్నారు జస్టిస్ రమణగారు.

తెలుగు నేల మీద కోర్టు వ్యవహారాలు తెలుగులో ఉన్నప్పుడే తెలుగు ప్రజలకు కోర్టుల పట్ల విశ్వసనీయత ఏర్పడుతుందని వారు అనేక సభల్లో పేర్కొన్నారు. వారి స్థాయిలో అనేక పర్యాయాలు అందుకోసం కృషిచేశారాయన.

2013లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా, జ్యుడిషియల్ అకాడెమీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు బుద్ధప్రసాద్ గారు అధికారబాషా సంఘం అధ్యక్షులుగా ఉన్నారు





ప్రధాని శ్రీ నరేంద్ర మోదీతో...

ఇద్దరూ కలిసి విజయవాడలో 'న్యాయపాలనలో తెలుగు' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు.

అంతకు ముందు 2009లో కృష్ణాజిల్లా రచయితల సంఘం మడభూషి శ్రీధర్ గారిని రాజేందర్ గారిని, ప్రముఖ న్యాయవాది కర్ణాటి రామామమోహనరావుగారిని ఆహ్వానించి న్యాయస్థానంలో తెలుగు గురించి ఒక సదస్సు నిర్వహించాము. తెలుగులో తీర్పులు ఇచ్చిన న్యాయమూర్తులను సత్కరించాము.

న్యాయ వ్యవస్థను ప్రజలకు దగ్గర చేయాలంటే భారతీయ సున్నితత్వాలకు అనుగుణంగా మార్పులు అవసరమని జస్టిస్ రమణ నొక్కి చెప్పారు. "భారతీకరణం"గా ఆయన దీన్ని భావించారు. స్థానిక భాషల్లో విచారణలు జరగాలని ప్రజల ఆకాంక్షను ఆయన స్వీకరించారు.

జస్టిస్ రమణగారి దృష్టిలో న్యాయవ్యవస్థ కేవలం తీర్పులు చెప్పే కేంద్రం కాదు, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఒక విశ్వసనీయ స్థంభం....అని! మాతృభాషకు తావులేనిదే ప్రజాస్వామ్యం ఎలా సాధ్యం అవుతుందనేదే ఆయన ప్రశ్న!

తీర్పుల అనువాద ప్రక్రియ ద్వారా జస్టిస్ చంద్రచూడ్, కృత్రిమ మేధతో న్యాయవ్యవస్థ ఆధునీకరణపై జస్టిస్ నాగేశ్వరరావు చేస్తున్న కృషిని కొనియాడుతూ, నూతన సాంకేతికతలతో న్యాయవ్యవస్థ తీరు మారుతున్నదని జస్టిస్ రమణ ప్రస్తుతించారు. ఉచిత న్యాయ సహాయ వ్యవస్థలలో భారతదేశం ముందు నిలబడుతోందని గర్వంగా ప్రకటించారు.

★ ★ ★



ధీర దయాగుణాల వారసత్వం లోంచి దేశ ధర్మమూర్తిగా...

జస్టిస్ నూతలపాటి వెంకటరమణ

- నూతలపాటి వీరనారాయణ

మనుజ సమాజనిర్మితి సమంబుగ నీకొక ముఖ్యమైన వృ
త్తినియత మట్టిధార్మిక విధిం జిరకాలము గౌరవంబుతో
మనిచిరి నీ పితామహు లమాంద్యసుశీలురు సర్వవృత్తిపా
వనకృషి జీవనైక పరిపాలన లోకహితార్థ కాంక్షులై

(దువ్వూరి రామిరెడ్డి కృషీవలుడు)

మనుషులందరూ కలిసి నిర్మించుకున్న ఈ సమాజంలో వ్యక్తిగా నీకొక నియతి ఉంది. అది ధార్మిక విధి. చిరకాలం ఆ విధి పట్ల గౌరవభావం కలిగి ఉండు. సుశీలురైన నీ తాతతండ్రులు మలచిన ఈ వ్యవస్థలో అన్ని వృత్తుల్లో కెల్ల పవిత్రమైన వ్యవసాయాన్ని జీవితానికి లక్ష్యంగా లోకహితం కోరుతూ కొనసాగించు"

కృషీవలుడు మా ముత్తాత

కృష్ణాజిల్లా వీరుళ్లపాడు తహసీల్లోని పొన్నవరం పేరుకు తగ్గ గ్రామం. బంగారాన్ని వరంగా పొందిన ఊరు. ఊరు ఎప్పుడేర్పడిందో తెలీదు. ఆ ఊరికి రెండొందల ఏళ్ల క్రితం సుమారు 1800 ఆ ప్రాంతాల్లో మా ముత్తాతగారు నూతలపాటి వీరయ్య చౌదరిగారు దుగ్గిరాల మండలం పేరకలపూడి నుండి జీవనోపాధి కోసం ఆ ఊరు చేరాక అది వరాల బంగారమే అయ్యింది. అడవులు కొట్టి రాళ్లు రప్పల్ని కరిగించి సుక్షేత్రమైన పంట భూముల్ని ఏర్పరచి నూతలపాటి వీరయ్య చౌదరిగారు వ్యవసాయ దారుడిగా జీవనం ప్రారంభించా రక్కడ.

"కోటి విద్యలు కొంద్రపాటి యగునే" అనే ఆర్యోక్తి వీరయ్యగారికి అక్షరాలా వర్తిస్తుంది. క్షేత్రజీవి, కర్మయోగి ఆయన. ఆద్యంతాలు లేని శరీర శ్రమకు ప్రతిఫలమైన పంటను చూసి మనసులోనే నమస్కరించుకునే వారు! తన కృషికి, తన శ్రమకు, తన ఆవేదనకి, తన ఆర్తికి, తాను చిందించిన చెమటకు, తాను వహించి భరించిన భారాలకు తగిన ప్రతిఫలంగా పండిన పంటను గౌరవించేవారు.

"కాలోహ్యయం నిరవధీ విపులాచ పృధ్వీ..." కాలం నిరవధికమైనది. నేల విశాలమైనది" అనే ఆశావాదం ఆయన్ని ముందుకు నడిపించింది. ఆయన వేసిన ప్రతీ అడుగూ పొన్నవరంను స్వర్ణమయం చేస్తూ వచ్చింది.

మా ముత్తాత వీరయ్యచౌదరిగారికి ఇద్దరు కొడుకులు. సీతయ్యచౌదరిగారు, బాపయ్య చౌదరిగారు. ఏడుగురు కూతుళ్లు. పెద్ద సంసారం. అయినా వెరవని వీరయ్యగారు నేలతల్లినే నమ్ముకోవాలనుకున్నారు.



ఎన్ని ఎకరాల సాగు ఉన్నా, వానపడితేనే సంబరం రైతుకి. పైరు ఎంత ఎత్తు పెరిగినా కంకికి మానుకాయ పడకపోతేనే ఆనందం. పంట బాగా పండిన ధాన్యానికి గిట్టుబాటు ధర రాకుంటే రైతు బ్రతుకు చచ్చుబండలే ! పంట పండి మంచి ధర వచ్చి నాలుగు రూపాయలు చేతి కొచ్చినా 'అమ్మాయి పెళ్లికి అంతా కరిగిపోయేదే కదా అని దిగులు. రైతుల ఇడుములు ఇలా ఉంటాయి. అవి రైతులకే తెలుస్తాయి!

"ఎండకు వానకు జంకక
పండించిన ధాన్యమెల్ల బాతరలందున్
నిండించి తినుచు బెట్టుచు
నుండెడి కర్షకుడె ధన్యుడూహింపగన్"

తెనుగులెంక తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారు అన్నట్టు తను ఎండావానల్ని లెక్కచెయ్యకుండా శ్రమించి పాతర్లలో ధాన్యాన్ని నింపి, లోకాన్ని పోషించే రైతుజన్మే ధన్యం అనేది వీరయ్యగారి నమ్మకం. లోకాన్ని తానే పోషిస్తున్నానని రైతు ఎన్నడూ అనుకోడు. తన ధర్మాన్ని తాను నెరవేరుస్తున్నాననుకుంటాడు. కానీ, రైతు పండించిన ధాన్యాన్ని తింటున్న లోకం రైతే తమని పోషిస్తున్నాడని అనుకోవాలి. అలా అందరూ అనుకోవటంలోనే రైతు జన్మ ధన్యత ఉంది.

"ఏను స్వతంత్రుడ ననగల మానిసి తలయెత్తుకొని తిరగగల మగసిరి గల వాడు ఒక్క రైతే" అనే కవివాక్యం అక్షర సత్యం.

"లోకంలోని భాగ్యానికంతా మూలం రైతే! పండ్లు తినేవారు ఆ రుచిని మెచ్చుకుంటారే కాని, చెట్టు గురించి ఆలోచించరు. అయినా కాలం ఎలా ఉంటుందో ఎవరు చెప్పగలరు? నీ కష్టాలు తీరవచ్చు. ధైర్యం విడువక శ్రమించు..." అనేది వీరయ్యచౌదరిగారి ప్రబోధం.

ప్రభుత్వ సహకారం, ప్రకృతి సహకారం లేకపోయినా ఆనాడు ఒక మారుమూల పల్లెని పెద్ద గ్రామంగా తీర్చి దిద్దిన ఘనత ఆయనదేనని మా పెద్దలు చెప్తుంటారు.

అంతటి కర్మయోగికి వారసులం కావటం మాకు ఆనందదాయకమే... కాదు, గర్వకారణం కూడా!

లోకహితుడు మా తాత

కాలం ఒకే తీరులా సాగదు. కష్టపడే వాడికే పెద్ద కష్టాలు కలిగిస్తుంటాడు భగవంతుడు. తట్టుకోగలడా లేదా అని పరీక్షించటానికి!

పిల్లలు పెద్దవబోతుండగా వీరయ్యగారి పెద్ద కొడుకు సీతయ్య చౌదరి వివాహం అయిన స్వల్పకాలంలోనే పిడుగుపడి మరణించాడు. పిడుగుపాట్లు, పాముకాట్లు రైతుబిడ్డలకు సహజమైన అంశాలే! బురదంటుతుందని నేలను కాదంటుందా విత్తనం? పురుగూ పుట్రా. ఉంటాయని రైతు బెదిరితే లోకానికి ఆహారం ఎక్కడిది? పిడుగులు పడకపోయినా, మెరుపులు మెరవకపోయినా లోకానికి నీటి చుక్కెక్కడిది... ఇలా



ప్రశ్నించుకుని కొడుకు పోయిన దుఃఖాన్ని అణచుకుని, తనను తానే సముదాయించుకున్నారు మా ముత్తాత.

అప్పుడే చిన్నకొడుకు బాపయ్యని కరడుగట్టిన రైతుగా తీర్చిదిద్దాలని దృఢంగా సంకల్పించుకున్నారాయన. కొన్ని సంకల్పాలకు బలం ఉంటుంది. అది నెరవేరి తీరుతుంది.

మా తాతగారైన బాపయ్యగారు తన తండ్రి ఆలోచనలకు సానుకూలంగా స్పందించారు. తన తండ్రికి బాసటగా నిలుస్తానని బాస చేశారు. మా నాయనమ్మగారు చెప్పిన ప్రకారం పొన్నవరం గడ్డకు పెద్దాయన మా ముత్తాత వీరయ్య చౌదరిగారే ఆయన దృఢ సంకల్పం కలవాడు కాబట్టే, అంతటి బలమైన పునాదులు వేయగలిగాడు.

బహుశా పొన్నవరం గ్రామంలో బాపయ్య చౌదరి అనే మా తాతగారు తన తండ్రికి ఇచ్చిన మాట మీద నిలిచి ఉండకపోతే, కొల్లాయి కట్టి, కాడిపట్టి బురద నేలలో కాలుమోపి ఉండకపోతే పొన్నవరం చరిత్ర ఎలా ఉండేదో చెప్పలేము.

కాలవశాన వీరయ్య చౌదరిగారు కూడా కాలం చేసినా బాపయ్యగారు తండ్రిమాట దాటలేదు, పొలంబాట వీడలేదు. చిన్న వయసు లోనే తన పైన ఏడుగురు తోబుట్టువుల భారం కూడా తోడయ్యింది. అయినా తండ్రి ఇచ్చిన మొక్కవోని ధైర్యంతో ముందుకే నడిచారాయన.

తన తోబుట్టువుల్లో ఐదుగురిని పొన్నవరంలోనే మంచి సంబంధాలు చూసి పెళ్లిళ్లు చేశారు. అందులో ఇద్దరికి నెప్పల్లి సంబంధాలిచ్చారు.

బాపయ్యచౌదరిగారి యోగ్యతని, బాధ్యతాయుతమైన ఆయన పనితీరుని, పట్టుదలని గమనించి ఏట్లో పారేసినా ఈదుకు రాగ లడన్న నమ్మకంతో అంగలూరు త్రిపురనేనివారి ఆడపడుచు రత్నమాణిక్యంగారి నిచ్చి పెళ్లి చేశారు. ఆ దంపతులకు ఇద్దరాడపిల్లలు, ఒక మగపిల్లవాడు వీరనారాయణ కలిగారు. కానీ, భవిష్యత్తులో బాపయ్యగారు ఒక ఆదర్శమూర్తిగా నిలిచే సుందర దృశ్యాన్ని చూసే అవకాశం లేకుండా చేసి, రత్నమాణిక్యంగారిని తొందరపడి తీసుకుపోయాడు భగవంతుడు. భార్యమరణం, చంటిపిల్లల్నిసాకడం ఆయన లక్ష్యాలకు అవరోధం అయ్యాయి. కానీ, మనోబలం, ఆత్మవిశ్వాసమే ఆయనకు అండగా నిలిచాయి.

కైకలూరు దగ్గర వరాహపట్నంలో చప్పన మాణిక్యమ్మగారు స్వాతంత్ర్య సమరయోధురాలిగా, గాంధేయవాదిగా పేరొందిన వ్యక్తి. వారి కుమార్తె కనికరమ్మగారిని భార్యా వియోగంతో బాధపడున్న బాపయ్యగారికి ఇచ్చి ద్వితీయ వివాహం చేశారు.

ఆయన జీవితంలోకి ఆమె అలా ప్రవేశించాక బాపయ్యగారి మనసు కుదుటపడింది. గుంటూరు కుగ్లర్ ఆసుపత్రిలో జన్మించిందని మా నాయనమ్మకు కనికరమ్మ అని పేరు పెట్టారట. కనికరం ఆమె జన్మ హక్కు అన్నట్టుగా ఉండేవారామె.



బాపయ్యగారి ఆశయాలకు అనుగుణంగా ఆమె అందించిన సహకారం ఆయన్ని కృష్ణాజిల్లాలోనే ఆదర్శ రైతుగా ఎదిగేలా చేసింది.

"పల్లె యెల్లయె సర్వప్రపంచ సీమ
ప్రియ యొకర్తెయే రమణీయ విగ్రహంబు,
బంగరుం బంట పొలములె భాగ్య నిధులు
అనుదిన పరిశ్రమమె నుతమగును నీకు"

తాను పుట్టిన ఊరే సర్వప్రపంచంగా భావించిన బాపయ్యగారికి తన భార్య కనికరమ్మ అందించిన తోడ్పాటుతో బంగారం పండే పొలాలను భాగ్యనిధులుగా మలచుకోగలిగారాయన. అనుదిన శ్రమ, కృషి, దీక్ష, పట్టుదల ఆయన్ని మునుముందుకు నడిపించాయి. మా తాతగారు, నాయనమ్మల కృషి ఆదర్శప్రాయమైనదే మాకెప్పుడూ!

మా తాత బాపయ్యగారి కాలం నాటి పరిస్థితి వేరు. అది బ్రిటిష్ పాలనాకాలం. వ్యవసాయానికి ప్రభుత్వ సాయం పెద్దగా ఉండేది కాదు. పన్నుల రాబడి మీదే వారికి శ్రద్ధ కదా!

బాపయ్య చౌదరిగారు వాణిజ్యపంటల మీద ఎక్కువ దృష్టిసారించారు. వ్యవసాయం చేస్తూనే వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ మీద కూడా శ్రద్ధ పెట్టారు. ఆ రంగంలో లోతుపాతుల్ని, కష్టసుఖాల్ని, లాభనష్టాల్నీ బేరీజు వేసుకున్నాకే వ్యవసాయోత్పత్తుల కొనుగోళ్లు అమ్మకాల వ్యాపారం ప్రారంభించారు.

తద్వారా తన ఆర్థిక స్థితిని ఉన్నత స్థితికి తీసుకు వెళ్లారాయన!

అలా అంచెలంచెలుగా దాదాపు 300 ఎకరాల భూమికి ఆసామి అయ్యారు. గుర్రం మీద స్వారీ చేస్తూ ఆయన తన పొలాల్లో జరుగుతున్న పనుల్ని పర్యవేక్షించేవారట. తండ్రి మాటను నిలబెడుతూ, ఆయన ఇచ్చివెళ్ళిన ఆస్తిని పదింతలు చేసి కుటుంబాన్ని సంపన్నం చేశారు.

పశ్చిమ కృష్ణాజిల్లాలో పెద్ద రైతు ఎవరంటే ముందుగా మాతాత బాపయ్య చౌదరిగారి పేరే వినిపించేదా రోజుల్లో! బ్రిటిష్ వారి కాలంలో ఆయన ఆదర్శరైతుగా గుర్తింపు పొందారు.

పాడిపరిశ్రమను కూడా ఆయన అమితంగా ప్రోత్సహించేవారు. ఆ రోజుల్లో నూతలపాటి వారి గేదెల్ని ఆవుల్ని వరుసగా వదిలితే, మొదటి గేదె బీట్లో ఉంటే చివరిగేదె గేట్లో ఉండేదని ఆ ఊళ్లో ఒక జాతీయం ప్రబలంగా ఉండేది. అంత పశు సంపదని ఆయన నిర్వహించారు.

మా ఇంట్లో అనునిత్యం బంధువులు, తనమీదే ఆధారపడిన కుటుంబీకులతో రోజూ వందలకొద్దీ విస్తళ్ళు లేచేవని చెప్పుకునేవారు. ఒక పెద్ద డబ్బా నెయ్యి తెరిస్తే రెండో రోజుకు కొత్త డబ్బా తెరవాల్సి వచ్చేదట!



నేతి వంటలే తప్ప నూనె వాసన తెలీని సంపన్నతను ఆయన తన కుటుంబానికి అందించారు. ఆడపిల్లకు పెళ్లిళ్లు జరిగితే మరకాలతో వెండినాణేలు కొలిచి వరకట్నంగా ఇచ్చేవారని చెప్పుకునేవారు. ఆ రోజులు అంతటివి.

1947 స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటిష్ వారికి ఆస్తిపన్ను అత్యధికంగా చెల్లించిన తొలి వ్యవసాయదారు మా తాత బాపయ్యగారే నంటారు. ఆస్తిపన్ను కట్టేవారికి మాత్రమే ఓటుహక్కు ఉండేదా రోజుల్లో! ఆ ప్రాంతంలో ఓటుహక్కు గలిగిన తొలి పౌరుడాయన.

బాపయ్యగారి అంచనాలు ఎంతో నిక్కచ్చిగా ఉండేవి. ఆయన సలహాలు సూచనలు కూడా అంతే సూటిగా ఉండేవి.

భూముల సర్వే కొలతలు వేయటానికి ఆయన టేపులు, తాళ్లు, ఇతర ఉపకరణాలేవీ వాడకుండా అంగలు వేసి అడుగులు లెక్కగట్టి చెప్పేవారట. శాస్త్రీయంగా కొలిస్తే ఆయన చెప్పిన లెక్కకి నూలువాసి కూడా తేడా ఉండేది కాదని చెప్పుకునేవారు.

బాపయ్యగారి కుటుంబం యావత్తూ జమీందారీ తరహాలో సంపన్నంగా జీవించారు. ఎవరికీ ఏ లోటూ కలగకుండా తన పిల్లల్ని, తన సోదరీమణుల్ని, వారి పిల్లల్ని కూడా చూసేవారు. ఆస్తిపాస్తులు ఆయనలో అహంకారాన్ని కాకుండా పదిమందికీ సమానంగా ఉపయోగపడే విధంగా జీవించాలనే తత్వాన్ని బాగా పెంచాయి.

కేవలం తనూ తన కుటుంబం అన్నట్టుగా కాకుండా ఊరందరికీ ఉపయోగ పడే విధంగా ఎన్నో సౌకర్యాలు కల్పించి గ్రామవాసుల అభిమానాన్ని చూరగొన్నారాయన. సాగుపనులకు పెట్టుబడి లేక ఇబ్బంది పడున్న రైతులకు ఆర్థిక సాయం చేసేవారు. వాళ్లంత వాళ్లే తిరిగి ఇచ్చేదాకా అడిగేవారు కాదని ఇప్పటికీ మా పెద్దలు చెప్తుంటారు.

నందిగామ మండలంలోని సోమవరం గ్రామానికి పూర్తిగా బాపయ్యగారే పెట్టుబడి పెట్టి వ్యవసాయం చేయించేవారట. ఇలా అటు వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూనే, రైతులకు గిట్టుబాటు ధరలు అందేలా చేసేవారాయన.

పొన్నవరానికి నీటి కొరత ఆది నుండీ ఉన్న సమస్యే! ఊరు దాహార్తి తీర్చేందుకు తన పొలంలో ఒక ఎకరం భూమిలో మంచినీళ్ల కుంట తవ్వించారు. ఆ కుంటలో నీరు ఏడాది పొడవునా ఉండేవి. పశుపక్ష్యాదులకు కూడా అవి ఉపయోగపడేవి. ఊరందరికీ ఉమ్మడిగా పెద్దబావిని కూడా తవ్వించారు. ఇప్పటికీ ఆ కుంటని బాపయ్యగారి కుంట అనీ, ఆ బావిని 'బాపయ్యగారి బావి' అనీ పిలుస్తూ ప్రజలు ఉపయోగించుకుంటున్నారు.

కంచికచర్లలో ఆయన ఒక బడి కూడా కట్టించారు దానికి "సత్రంబడి" అని పేరు పెట్టారు. ఇప్పటికీ అది సత్రంబడిగానే నిలిచి ఉంది.

సత్రము అంటే ఒక యజ్ఞం. నిరంతర దానం దాని విధి. కాళిదాసు రఘువంశంలో "తమధ్వరే విశ్వజితి క్షితీశం నిశ్శేష విశ్రాణిత కోశజాతం" అంటూ ఒక శ్లోకం ఉంది. విశ్వజిత్ అనే సత్రయాగాన్ని చేసి రఘుమహారాజు తన సంపదనంతా దానధర్మాలు



చేశాడట. దాన ధర్మాలతో కూడిన సేవాకార్యక్రమాల కేంద్రం అనే అర్థంలో 'సత్రం' అనే పదం స్థిరపడింది!

ఉచిత భోజన, వసతి సౌకర్యాలుండే ఆవాసాల్ని సత్రశాల లంటారు. వాటిని ఇప్పుడు మనం ధర్మ సత్రాలంటున్నాం. అలాగే, నిరంతర ఉచిత విద్య దానంగా అందుతుంది కాబట్టి, 'సత్రంబడి' అనేది సార్థక నామధేయి.

ప్రతీ ఏడాదీ పండుగల సమయంలో తాము పండించిన కూరగాయల్ని బళ్ళకెత్తించి కంచికచర్ల తీసుకువెళ్లి కావలసినన్ని కూరల్ని తీసుకువెళ్లమని వితరణ చేసేవార్ట ఈ ఊరు రైతులు. నిజానికి రైతు మనస్తత్వం ఇదే!

"పరహితము సేయు నెవ్వడు
పరమ హితుండగును భూత పంచకమునకున్
బరహితమె పరమ ధర్మము
పర హితునకు నెదురు లేదు పర్వేందు ముఖీ!" అంటూ బమ్మెర పోతనామాత్యుడు– భాగవతంలో చెప్పినట్టు రైతు మనసు ఎప్పుడూ పరహితాన్నే కోరుతుంది.

పండుగరోజు సమస్త ప్రజానీకమూ సంతోషంతో గడపాలని మా తాతగారి కోరిక. తాత ముత్తాతల నుండి మాకు సంక్రమించిన శాశ్వత ఆస్తులు ఈ గుణాలేనని మా నమ్మకం..

దయామూర్తులు మా పెదనాన్న, నాన్న

బాపయ్యగారికి కనికరమ్మగారి ద్వారా ఇద్దరు కొడుకులు ముగ్గురు కుమార్తెలూ కలిగారు. మొదటి భార్య రత్నమాణిక్యంగారితో కలిగిన ఇద్దరాడ పిల్లలు, ఒక మగపిల్లవాడితో కలిపి మొత్తం ముగ్గురు కొడుకులు, ఐదుగురు ఆడపిల్లల్నిమా నాయనమ్మ ఎలాంటి తేడా లేకుండా సమానంగా కనికరంతో పెంచింది.

పెద్దభార్య కుమారుడు వీరనారాయణ, మా పెదనాన్న గణపతిరావుగారు మద్రాసులో చదువుకున్నారు మద్రాసులో చదువుకుంటూ ఉండగా రాచపుండు వ్యాధితో వీరనారాయణగారు మరణించాడు.

గణపతిరావు, సరోజినీదేవి దంతులకు ఇద్దరు కుమార్తెలు ప్రభంజని (భర్త జి. ఆర్. ప్రసాద్), వాణి (భర్త కిషోర్), ఆ తరువాత ఒక కుమారుడు కలిగారు. ఆ కుమారుడే భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఎదిగిన మా సోదరుడు జస్టిస్ నూతలపాటి వెంకటరమణ. గణపతిరావుగారి తమ్ముడు సత్యనారాయణగారి కుమారుణ్ణి నేను! మా అమ్మగారు వసుమతి.

దానగుణంలో మా తాతయ్య కంటే మా పెదనాన్న గణపతిరావుగారు, మా నాన్న సత్యనారాయణ గారూ కొన్ని ఆకులు ఎక్కువే చదివారు. ఫలితంగా మా కుటుంబం సంపన్నస్థాయి నుండి మధ్యతరగతి స్థాయికి దిగిపోయింది. ఆస్తులు కరిగిపోయాయి.



కరిగిపోయింది ఆస్తులేగానీ, చెరిగిపోనిది తరతరాలకు సరిపడినంత ఘనకీర్తి. అది డబ్బుతో కొనగలిగేది కాదు. నిప్పుతో కాలేదీ కాదు. కత్తితో చిరిగేదో విరిగేదో కాదు. కీర్తి ఒక్కటే శాశ్వతం.

మా తాత బాపయ్యగారి కాలానికి, మా పెదనాన్న, మా నాన్నల కాలానికి కొంత తేడా ఉంది. జాతీయోద్యమం ఒక వైపు, తెలంగాణలో సాగుతున్న సాయుధపోరాటం ఇంకో వైపూ జనవాహినిని అమితంగా ప్రభావితం చేసిన కాలం అది! త్యాగం అనేది ఆనాటి వ్యక్తుల్లో ముఖ్యమైన లక్షణం అయ్యింది. ఇతరుల కోసం జీవించాలనే తపన మా పెదనాన్నకీ (రమణగారి తండ్రి), మా నాన్నకీ మరీ ఎక్కువగా ఉండేది.

ఆంధ్ర- తెలంగాణా సరిహద్దు గ్రామం కావటాన పొన్నవరం పరిసర ప్రాంతాల్లోని యువకులను కమ్యూనిష్టు ఉద్యమం బాగా ఆకర్షించింది. వాళ్లలో మా నాన్నా, పెదనాన్నా కూడా ఉన్నారు. రజాకార్ల దౌష్ట్యానికి గురైన అనేకమంది మంది బాధితులు సరిహద్దుల్లోని ఆంధ్రగ్రామాలకు వచ్చి తలదాచుకునేవారు.

పొన్నవరం గ్రామస్థులు సాయుధ పోరాట యోధులకు ఆశ్రయం ఇస్తున్నారని రజాకార్లు అప్పుడప్పుడూ మా ఊరి మీద కూడా దాడులు చేస్తుండేవారు. మా నాన్న, పెదనాన్నలు కూడా ఈ దాడులకు గురైనవారే!

పీడిత తాడిత వర్గాల పక్షాన నిలవాలనే తపనతో అన్నింటినీ భరించారు. ఆస్తులు కరిగిపోతున్నా అభ్యుదయమే ధ్యేయంగా నిలిచారు.

మా సంతానం

1986లో రమణగారు, రాజమండ్రి వాస్తవ్యులైన దండమూడి వెంకటరామారావుగారి కుమార్తె శివమాలను వివాహమాడారు. వారికి ఇద్దరు కుమార్తెలు డా. శ్రీ భువన. అల్లుడు యార్లగడ్డ రితిష్, వీరికి ఇద్దరు కుమార్తెలు: శ్రీశ్రియ, శ్రీనిత్య.

రెండవ కుమార్తె శ్రీ తనూజ. అల్లుడు పొట్లూరి త్రిలోక్ గారు. వీరికి ఒక బాబు శ్రీ విరాట్.

1974లో మలినేని వెంకటేశ్వర రావుగారి కుమార్తె ఝాన్సీవాణితోనా వివాహం జరిగింది. మాకు ఒక బాబు, ఒక పాప ఉన్నారు. బాబు వెంకట సుమన్, కోడలు పూర్ణిమ.

వీళ్లకి ఇద్దరు మగపిల్లలు అద్వైత్ బాపయ్య చౌదరి, అర్ణవ్ వీర చౌదరి. మా కుమార్తె సౌమ్య, అల్లుడు శ్రీనివాస్ చౌదరి గార్లకి ఇద్దరు ఆడపిల్లలు పూర్వజ, పరిణిక.

వారసత్వంలోని ధీర సత్త్వం

ధీర దయాగుణాలతో వితరణశీలురుగా పేరొందిన మా పూర్వీకుల వారసత్వం పుణికి పుచ్చుకున్న మా సోదరుడు జస్టిస్ వెంకటరమణ నాకన్నా ఐదేళ్లు చిన్నవాడైనప్పటికీ దేశం

పట్టనంత ఎత్తుకు ఎదిగి, జాతి గర్వించదగిన మహోన్నతుడిగా దేశ అత్యున్నత న్యాయస్థానానికి ప్రధాన న్యాయమూర్తిగా నియమితులు కాగలిగారు.

ఆయన వలన మా వంశగౌరవం ఇనుమడించింది. మా తాతముత్తాతలు సాధించిన కీర్తికి మా రమణగారు పరిమళాన్ని అద్దారని భావిస్తాను.

వెంకట రమణగారు నాయకత్వ లక్షణాలను ధీర గుణాలను చిన్ననాటినుండే ప్రదర్శించేవారు. ఎప్పుడూ పదిమందికి తక్కువ లేకుండా ఆయన వయసు పిల్లలు చుట్టూ ఉండేవారు. ఆచార్య యన్ జి రంగా గారి ఉపన్యాసాలు, ఇతర దేశనాయకుల ప్రసంగాలను వాళ్లకి విడమరచి చెప్తుండేవాడు. చిన్ననాటి నుండీ అభ్యుదయ భావాలను పుణికి పుచ్చుకుని తాత తండ్రుల ఆదర్శాలకు అసలైన వారసుడిగా తనను తాను మలచుకున్నాడనిపిస్తుంది.

మా వారసత్వంలోని ధీర సత్వం ఆయన్ని లక్ష్యసాధన వైపు వేగంగా నడిపించిందనే నమ్ముతున్నాను. ఆయన కృషి, దీక్ష, పట్టుదలలే ఆయనకు శ్రీ రామరక్ష.

★ ★ ★



తిరుమలలో కుటుంబ సభ్యులతో జస్టిస్ ఎన్.వి. రమణ



ఓ రైతు బిడ్డ న్యాయప్రస్థానం

జస్టిస్ రమణ గారితో ఇంటర్వ్యూ

- ఎ. కృష్ణారావు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఢిల్లీ

“అక్కడ ఒక వైభవోజ్జ్వల మహాయుగమూ ఉంటుంది - మరో వైపు వల్లకాటి అధ్వాన్న శకమూ కొనసాగుతుంది. ఒకవైపు వెల్లివిరిసిన విజ్ఞానం కనపడుతుంది. మరోవైపు బ్రహ్మాజెముడులా అజ్ఞానమూ గోచరిస్తుంది. ఒక వైపు పరమ భక్తి విశ్వాసాలు నిండిన అయోమయ నిశీధి ఉంటే మరో వైపు ఆశా కుసుమాలు సృష్టించిన మధుర వసంతం కమనీయంగా ఉంటుంది. ఒకవైపు నైరాశ్యపు చలి దట్టంగా అలుముకుంటే, మరో వైపు సర్వ సమృద్ధిగా కనపడుతుంది. ఒక వైపు క్షామం తాండవిస్తుంటే, మరో వైపు స్వర్గానికి రాచబాట ప్రత్యక్షమవుతుంది. ఒకవైపు ప్రజలు నరకానికి సూటిగా నడుస్తుంటే. మరో వైపు అంతా అమోఘంగా ఉన్నదని అధికార కంఠాలు అరుస్తుంటాయి..”

ప్రముఖ నవలా రచయిత చార్లెస్ డికెన్స్ 1859లో ‘ఏ టేల్ ఆఫ్ టూ సిటీస్’లో రాసిన వాక్యాలను న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీరమణ జమ్ము కశ్మీర్‌లో పరిస్థితులకు అన్వయించి 2019 జనవరి 10వ తేదీన ఇచ్చిన తీర్పు న్యాయ వర్గాల్లో, మేధావుల్లో సంచలనం సృష్టించింది.

దేశ సామాజిక పరిస్థితిపై, సాహిత్యంపై ఆయనకున్న లోతైన అవగాహన గురించి జాతీయ, అంతర్జాతీయ మీడియాలో చర్చ జరిగింది. సామాజిక చైతన్యానికీ, సాహిత్యానికీ అవినాభావ సంబంధం ఉన్నదని ప్రగాఢంగా విశ్వసించే జస్టిస్ నూతల పాటి వెంకటరమణ దేశంలో అత్యున్నత న్యాయస్థానంలో అత్యున్నత పదవిని అలంకరించారు. అయిదున్నర దశాబ్దాల తర్వాత ఒక తెలుగువాడు ఈ పదవిని అధిష్టించి తెలుగువారు గర్వపడేలా చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ రమణతో ఇష్టాగోష్టిగా మాట్లాడినప్పుడు తన సామాజిక దృక్పథం, రైతు నేపథ్యం, సాహిత్యంపై ఉన్న అభిరుచి, అభినివేశం, మాతృభాషాభిమానం, జీవితంపై తన దృక్పథం వంటి అనేక అద్భుత కోణాలు ఆవిష్కృతమయ్యాయి.

పోరాట స్ఫూర్తితో సాగిన బాల్యం

అదో మారుమూల పల్లెటూరు. పేరు పొన్నవరం కృష్ణాజిల్లా వీరులపాడు మండలంలో జాతీయ రహదారికి దూరంగా ఓ మూలకు విసిరేసినట్లుంటుంది.

ఆసుపత్రీ, కరెంటూ, సరైన రోడ్లూ లేవు సరికదా, తాగడానికి గుక్కెడు నీళ్ళు దొరకడమూ గగనమే.



ఊరి మొదట్లో ఉన్న ఓ ఇంటి అరుగు మీద రాజు మాస్టారు బడి. మామయ్య గుంటుపల్లి రామయ్య చౌదరి పంపిన పలకా బలపం పట్టుకుని, పెద్దమ్మ వరలక్ష్మి పంపిన కొత్త చొక్కాలాగూ వేసుకుని కాస్త బిడియంగానే ఆ బడిలో అడుగు పెట్టాను... అదే నా అక్షరాభ్యాసం.

అప్పటిదాకా, రోజంతా అమ్మ కొంగు పట్టుకు తిరిగిన నాకు కుదురుగా ఒకచోట కూర్చుని అక్షరాలు దిద్దాలంటే తగని చిరాగ్గా ఉండేది. ఎంత సేపూ ఏ వంకతో బడి ఎగ్గొడదామా అన్న ఆలోచనే. మా అమ్మకి మాత్రం నేను చాలా గొప్పవాణ్ణవుతానని మహా నమ్మకం. ఇద్దరు ఆడపిల్లల తరవాత పుట్టిన నేనంటే అమ్మకు పంచప్రాణాలు మరి. అక్కలు రాణి, వాణీలకూ నేనంటే అంతే ముద్దు. ఆ ప్రేమ పూర్వక వాతావరణం నన్ను ఒకింత సున్నితంగా మార్చింది. ఇతరుల కష్టనష్టాలకు స్పందించే గుణాన్ని నేర్పింది. నిజానికి ఆ లక్షణం నాకు వంశపారం పర్యంగా వచ్చిందనే చెప్పాలి.

బాపయ్య కుంట...

మా తాతగారు నూతలపాటి బాపయ్యచౌదరి, వ్యవసాయంతోపాటు మార్కెటింగ్ లావాదేవీలు చేస్తూ బాగా సంపాదించారు. ఆస్తిపాస్తులు ఆయనలో అహంకారాన్ని కాక ఆత్మీయతను పెంచాయి. సాటివారికి సాయం చేయడంలోనే ఆనందం ఉందని నమ్మారు. నీటి సదుపాయం లేక ఊరి జనం నానా అవస్థలు పడుతున్నారని ఎకరం పొలంలో కుంటనీ, ఓ పెద్ద బావినీ తవ్వించారు. తాగడానికైనా ఇతర అవసరాలకైనా ఊరంతటికీ ఆ 'బాపయ్య కుంట నీరే ఆధారం.

అలాగే, కంచికచర్లలో బడినీ కట్టించారు. 'సత్రం బడి' అంటారు దాన్ని. సాగుపనులకు పెట్టుబడి లేని రైతులకు ఆర్థిక సహాయమూ చేసేవారు. పంట చేతికి వచ్చాక వాళ్లంతట వాళ్లే తిరిగి చెల్లిస్తే తప్ప తనంతట తాను అడిగేవారు కాదు. తిండిగింజలకు కటకటగా ఉందనో ఏదైనా పనిచూపమనో వచ్చిన వాళ్ళను ఆయన వట్టిచేతులతో పంపింది లేదు.

మా నాన్న గణపతిరావు. ఆయన మూడో సంతానం. దానగుణంలో తాతయ్యకంటే నాలుగాకులు ఎక్కువ చదివారనే చెప్పాలి. అప్పట్లో తెలంగాణలో ఉధృతంగా సాగుతున్న సాయుధపోరాటం నైజాంలోనే కాకుండా ఆంధ్రా ప్రాంతంలోనూ ఎంతోమంది యువకుల్ని ఆకర్షించింది. వాళ్ళలో మానాన్నా ఒకరు.

కమ్యూనిస్టుగా అన్యాయాల పట్ల కన్నెర్ర చెయ్యడమే కాదు, చుట్టూ ఉన్న పేదల అభ్యున్నతికి ధారాళంగా డబ్బు ఖర్చు చేసేవారు. ఫలితంగా తాతయ్య సంపాదించిన ఆస్తులు కరిగిపోయాయి. శ్రీమంతులుగా ఉన్న కుటుంబం మధ్య తరగతి స్థాయికి వచ్చింది.

ఆస్తిపాస్తుల మాటెలా ఉన్నా చదువు విషయంలో మాత్రం మాకు ఏ లోటూ



చేయకూడదనుకున్నారు అమ్మానాన్నా. ఐదో తరగతి వరకూ ఊళ్ళో చదివి, పక్కన జమ్మవరంలో ఆరో తరగతిలో చేరాను. పొద్దున్నే నడిచి వెళ్ళి సాయంత్రానికి నీరసంగా తిరిగి వచ్చే వాణ్ణి. అలా కాదని కాపురాన్ని కంచికచర్లకు మార్చారు. ఎనిమిది నుంచి పదో తరగతి దాకా అక్కడి జిల్లా పరిషత్ హైస్కూల్లో చదివాను.

ఈ కొత్త ఊరికి వచ్చాక రకరకాల వ్యాపకాలతోనూ తనను కలవడానికి వచ్చే నాయకులతో చర్చల్లోనూ నాన్న తలమునకలుగా ఉంటే అమ్మ మాకు కాస్త ఒళ్ళు వెచ్చబడినా నిద్ర హారాలు మాని సేవచేస్తూ మేం చదువుని అశ్రద్ధ చేయకుండా జాగ్రత్త పడుతూ మమ్మల్ని కళ్ళల్లో పెట్టుకుని పెంచింది. అమ్మ నమ్మకాన్ని నేనూ వమ్ము చేయలేదు.

చదువులో సగటు విద్యార్థినే అయినా... నలుగుర్ని ఉద్దేశించి ప్రసంగించాలంటే ధైర్యంగా ముందుకెళ్లేవాణ్ణి. ఉపన్యాస పోటీల్లో బల్లగుద్ది మరీ నా వాదనని వినిపించేవాణ్ణి. విద్యార్థి నాయకుడిగా ఎదిగే క్రమంలోనా తొలి అడుగులవి.

ఆత్యయిక పరిస్థితి

అప్పట్లో నాకు డాక్టర్ కావాలని ఉండేది. అందువల్ల ఇంటర్లో బైపీసీ తీసుకుని అమరావతిలోని రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు (ఆర్వీవీఎన్) కాలేజీలో చేరాను. మా ఊరి నుంచి అక్కడికి వెళ్లాలంటే కృష్ణానది. దాటి... చాలా దూరం నడిచి వెళ్లాలి కాబట్టి అక్కడి హాస్టల్లో ఉంటూ వచ్చాను. ఆ కాలేజీకి వచ్చాక విద్యార్థి సంఘాలతో మమేకమయ్యాను. అన్యాయమని తోచిన ప్రతిదాన్నీ ప్రశ్నించడం, న్యాయం కోసం పోరాడటం అలవర్చు కున్నాను. ప్రజాకంటకంగా అనిపించిన ప్రతి విషయంపైనా విద్యార్థుల్ని కూడగట్టి నిరసన తెలపడం మొదలు పెట్టాను.

ఇంటర్ సెకండియర్లో ఉండగా, వేసవి సెలవుల్లో ఓరోజు గుంటూరు, విజయవాడల నుంచి మా ఊరికి పౌరహక్కుల నేతల్ని ఆహ్వానించి మీటింగ్ ఏర్పాటుచేశాం. సమావేశానికి నేను బయల్దేరబోతుండగా మా నాన్న 'బాబూ..! బయట పరిస్థితులు బాగాలేవు... జాగ్రత్త!' అన్నారు. అనడమే కాదు 'ఇందా ఉంచు!' అంటూ నా చేతికి పదిరూపాయలిచ్చారు.

నేను ఆ డబ్బు తీసుకుని సమావేశం జరిగే చోటకి వెళుతుంటే... దూరం నుంచి ఉరుకులూ పరుగుల మీద వచ్చిన నా మిత్రుడు వీరయ్య నా భుజం పట్టుకుని వెనక్కి తిప్పుతూ 'పోలీసులు – స్టూడెంట్ లీడర్లని దొరికిన వాళ్లని దొరికినట్టు పట్టు కెళ్లి పోతున్నారు. పరిగెత్తు' అన్నాడు.

అతనేం చెబుతున్నాడో పూర్తిగా అర్థం కాకున్నా... ఇద్దరం పరుగెత్తడం మొదలు పెట్టాం.

లారీ ఒకటి కనిపిస్తే ఎక్కేశాం. అది బందరు వెళ్తోంది. కంకిపాడు దగ్గరదిగి,



నెప్పల్లిలో ఉంటున్న మా అత్తయ్య దగ్గరకు వెళదామనుకున్నాం. ఆ లారీ కంకిపాడు చేరుకునే టప్పటికి బాగా రాత్రయింది. అక్కడ దిగాక కానీ ఆ రోజు దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీ విధించారన్న విషయం మాకు తెలియలేదు. మేం వెళ్లడానికి బస్సులేవు. దాంతో నడక మొదలు పెట్టాం...

నాలుగురోజుల్లో పరిస్థితి చక్కబడుతుందనే నమ్మకంతో... మరో వారం పది రోజుల్లో మేం నిర్వహించాల్సిన సమావేశాల గురించి మాట్లాడుకుంటూ నడుస్తున్నాం. మాకు తెలియనిదేమిటంటే ఆ ఎమర్జెన్సీ కారణంగా మేం ఏడాదిపాటు అజ్ఞాతంలోనే ఉండాల్సి వస్తుందనీ... మా చదువులకి అది పెద్ద ఆటంకంగా మారబోతుందనీ!

అవును! 1975 జూన్ 25న ప్రకటించిన అత్యయిక పరిస్థితితో తీవ్ర అటుపోట్లకి గురైన లక్షలాది విద్యార్థుల జీవితాల్లో నాదీ ఒకటి. ఆ కారణంగా ఇంటర్ పాసయ్యాక వైద్య విద్య కాదుకదా..... ఏ విద్యవైపూ వెళ్లలేకపోయాను. ఏడాది పాటు నా చదువుకి అంతరాయం ఏర్పడటం బాధ కలిగించినా... అత్యయిక పరిస్థితి కారణంగా ప్రాణాలు కోల్పోయినవాళ్లూ, క్షత గాత్రులుగా మిగిలినవాళ్లతో పోల్చుకుంటే నా నష్టం ఏపాటిది అనిపించేది. వాళ్లూ, వాళ్ల కుటుంబాల కన్నీళ్లూ... సగటు పౌరుల స్వేచ్ఛాస్వాతంత్ర్యాలూ, వాటిని ప్రసాదించే హక్కులూ ఎంత ముఖ్యమైనవో నాకు తెలియజెప్పాయి.

మితవాద ఆర్ఎస్ఎస్ నుంచి అతివాద రాడికల్స్ దాకా ఎమర్జెన్సీని వ్యతిరేకించిన చాలామంది అప్పుడే పరిచయమయ్యారు. తర్వాత గుంటూరు హిందూ కాలేజీలో బిఎస్సీలో చేరినా ఒక్కరోజు కూడా కాలేజీకి వెళ్లలేదు. చదువుమీద ఆశ వదిలి ప్రత్యామ్నాయాల గురించి ఆలోచిస్తుండగా ఎమర్జెన్సీని ఎత్తేశారు. దాంతో ఆ వీవీఎన్ కాలేజీలోనే బీఎస్సీలో చేరాను. ఈసారి ముందుకంటే ఎక్కువగా విద్యార్థి హక్కుల పైన పోరాడటం మొదలు పెట్టాను. కానీ... ప్రతి పోరాటమూ శాంతియుతంగా, ప్రతి పరిష్కారమూ సామరస్య పూర్వకంగా ఉండితీరాలని సంకల్పించుకున్నాను. ఈ పద్ధతి నేను ఎవరికి వ్యతిరేకంగా పోరాడుతున్నానో వాళ్లనీ నాకు మిత్రులుగా చేసింది.

డిగ్రీ తర్వాత జర్నలిజంలో ఆసక్తి కలిగి ఆర్నెల్లపాటు ఓ ప్రముఖ దినపత్రికలో జర్నలిస్టుగా పనిచేశాను కూడా! పాత్రికేయ వృత్తి నాకు బాగా నచ్చినా నాన్న న్యాయవిద్య చదవమన్నారు. సరిగ్గా ఆ ఏడాదే నాగార్జున విశ్వవిద్యాలయంలో న్యాయ విభాగం మొదలైంది.

నాన్నే.. స్వయంగా దరఖాస్తు తెచ్చిచ్చారు. ఆ న్యాయ విద్య ఓ ఉలిలా నా వ్యక్తిత్వాన్ని చెక్కిందని చెప్పాలి. హక్కుల కోసం అహింసని ఆశ్రయిస్తే ఎన్ని అద్భుతాలు చేయొచ్చో నేర్పింది! క్యాంపస్లోనూ యూనియన్ పనుల్లో చురుకుగా ఉండేవాణ్ణి. ఎంతగా పోరాడినా ఎక్కడా హింసకి పాల్పడింది లేదు... ఎంత గట్టిగా మాట్లాడినా ఎదుటివాళ్లని తూలనాడిందీ లేదు... ఓ గుండు సూది మేరకు కూడా ఆస్తి నష్టం కలిగించిందీ లేదు! న్యాయ పట్టా పుచ్చుకున్నాక – ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకి వెళ్లాలన్నారు నాన్న!



1983లో బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్నాను. తరువాత విజయవాడలో సీనియర్ న్యాయవాది కె. రవీంద్రరావు దగ్గర జూనియర్‌గా చేరాను. అప్పుడే ప్రముఖ న్యాయ నిపుణుడు డాక్టరు పి.సి. రావు పరిచయమయ్యారు. న్యాయవాదిగా నాకు దిశానిర్దేశం చేశారు. తరువాత, హైకోర్టులో నాటి ప్రసిద్ధ క్రిమినల్ లాయర్ ఏరాసు అయ్యపు రెడ్డి దగ్గర జూనియర్‌గా చేరాను. కన్న కొడుకు కన్నా ఎక్కువగా నన్ను చూసుకునేవారాయన. హైదరాబాదులో గదిని తీసుకున్నప్పటికీ, ఎప్పుడూ అయ్యపురెడ్డి గారింట్లోనే ఉండేవాణ్ణి.

ఎన్టీఆర్ గారు తెలుగుదేశం పార్టీ పెట్టాక – అయ్యపు రెడ్డి ఎంపీగా పోటీ చేసి గెలవడంతో. అప్పటిదాకా ఆయన చూస్తూ వచ్చిన కొన్ని ముఖ్యమైన కేసుల బాధ్యత నేను తీసుకున్నాను. ఆ క్రమంలోనే ఎన్టీఆర్‌కి సంబంధించిన కోర్టు వ్యవహారాలూ చూడటం మొదలు పెట్టాను. ఆయనతో ఆ అనుబంధం ఆయన చనిపోయేదాకా కొనసాగింది.

మొదట్లో క్రిమినల్ చట్టాల పైనే దృష్టి పెట్టినా, ఆ తర్వాత ఎన్నికల చట్టాల్ని అధ్యయనం చేయటం ప్రారంభించాను. కొన్ని కేసుల కోసం సుప్రీం కోర్టుకి కూడా వెళ్లాల్సి వచ్చేది. అప్పుడే నాకు నానీ పాల్కీవాలా, రాంజేఠ్మలానీ, శాంతిభూషణ్, సోలీ సోరాబ్జీ వంటి ప్రఖ్యాత న్యాయవాదులతో స్నేహం ఏర్పడింది. కొన్ని కేసుల నిమిత్తం వాళ్లతో కలిసి పనిచేశాను కూడా. ఈ అనుభవం నాకు రాజ్యాంగ చట్టాలపై నైపుణ్యాన్ని పెంచింది! అది నాకు కెరీర్ లో బలమైన పునాదిగా నిలిచి, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల ట్రైబ్యునళ్లలో పనిచేసే అవకాశం ఇచ్చింది.

ఆపేక్ష ఎక్కువ

1986లో దండమూడి వెంకటరామారావు గారి కుమార్తె శివమాలతో నాకు వివాహం జరిగింది. కెరీర్‌లో అప్పుడప్పుడే ఎదుగుతున్న సమయం అది. రోజుకి 16 గంటలు వృత్తి పైనే దృష్టి పెట్టాల్సి వచ్చేది. అది పోగా మిగిలిన సమయంలోనే భార్యా పిల్లలతో గడిపేవాణ్ణి. ఆ కాసేపూ ప్రపంచాన్ని మరిచి పోయేవాణ్ణి. నాకు చిన్నప్పటినుంచీ అనుబంధాలపైన ఆపేక్ష ఎక్కువ. ఊరెళితే బంధువులు, స్నేహితులు కలగలిసిపోతుంటాను. ఆ మనస్తత్వం వల్లనేనేమో క్రిమినల్ లాలో పీజీ చేయడానికని అమెరికా వెళ్లి కూడా ఎవరికి వారే.... అన్నట్టుండే అక్కడి సంస్కృతిని జీర్ణించుకోలేక, ఆ వాతావరణంలో ఇమడలేక ఇండియాకి వచ్చేశాను. ఇక్కడికొచ్చాక సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌లో అడిషనల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా వెళ్లాను.

1990 దశకంలో కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచాలని నిర్ణయించినప్పుడు దాన్ని వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది పరాశరతో కలిసి సుప్రీంకోర్టులో వాదనలు వినిపించటం వృత్తి పరంగా గొప్ప అనుభవం. 1998లో రాష్ట్ర అడిషినల్ అడ్వకేట్ జనరల్‌గా నియమించారు. తరువాత ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో శాశ్వత న్యాయమూర్తిగా నియామకం, వచ్చింది.



న్యాయవాద వృత్తిలో ఉన్నవాళ్లు ఎవరైనా అందుకోవాలనుకునే ఉన్నత హోదా అది... కానీ, నా మనసులో ఏమూలో చిన్న బాధ... నేనో మంచి న్యాయ నిపుణుణ్ని కావాలనుకున్న నాన్న... పట్టుబట్టి మరీ నా చేత న్యాయవిద్య చదివించిన నాన్న..... అంతకు కొద్దికాలం ముందే చనిపోయారు. ఆయన నన్ను ఉన్నత స్థితిలో చూడకుండానే కన్నుమూయడం నాకు ఎప్పటికీ తీరని లోటే. కాకపోతే– అమ్మ మాత్రం నేను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టడం కళ్లారా చూసి ఆనందంగా దీవించింది. అది నాకు ఎంతో సంతృప్తి.

మానవీయ స్ఫూర్తి

న్యాయమూర్తి హోదా నన్నూ, నా స్వభావాన్నీ, వ్యక్తిత్వాన్ని మార్చేసింది అనడం కన్నా కృషితో మార్చుకోవాల్సి వచ్చింది అనడం బావుంటుంది. ఓ న్యాయవాదిగా కేసు నెగ్గడం కోసం చట్టాలకి మనదైన భాష్యం చెబుతుంటాం... తర్క వితర్కాలతో గట్టిగా వాదిస్తాం. కానీ న్యాయమూర్తిగా ఇరు పక్షాల భాష్యాలనీ, వాదనల్నీదాటి పరిణతితో ఆలోచించాల్సి ఉంటుంది. ఒక్కోసారి చట్టాలూ, నిబంధనలకన్నా వాటి వెనకున్న – రాజ్యాంగం ఉద్దేశించిన మానవీయ స్ఫూర్తిని పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఆ చట్టాలూ, రాజ్యాంగ స్ఫూర్తీ తప్ప న్యాయమూర్తులుగా మరే ఒత్తిడి మా పైన పనిచేయకూడదు.

అందుకే– న్యాయమూర్తులుగా మేమే కాదు... మా కుటుంబ సభ్యులు కూడా సమాజంలో ఆచితూచే అడుగేయాల్సి ఉంటుంది. మొదటి నుంచీ ఆ క్రమశిక్షణ ఉండడంతో మా కుటుంబం సునాయాసంగా ఈ కొత్త జీవితంలోకి ఇమిడిపోవడం సహజమే అయినా కొత్తగా మా కుటుంబంలో భాగమైన అల్లుళ్లు రితేష్, త్రిలోకు సైతం ఎంతో హుందాగా పరిస్థితులను అర్థం చేసుకుని సర్దుకుపోవడం విశేషం.

ధర్మాసనం మీద కూర్చుంటే...

ఓ న్యాయమూర్తిగా మనమిచ్చే తీర్పువాది, ప్రతివాదుల్లో ఎవరో ఒకరికి కొంత కష్టమో నష్టమో కలిగిస్తుంది... అది తప్పదు కూడా. కానీ, మనం చూడాల్సింది చట్టానికి కట్టుబడ్డామా లేదా అన్నదే, రాజ్యాంగ స్ఫూర్తికి పట్టం కట్టామా లేదా అన్నదే! ఒకసారి ధర్మాసనం మీద కూర్చున్న తర్వాత న్యాయమూర్తికి ఎదుట ఉన్న వ్యక్తులూ, వాళ్ల హోదాలూ, నేపథ్యాలూ ఏవీ కనిపించవు.

న్యాయం కోసం వచ్చిన మనిషి. అతని సమస్య. దానికి న్యాయదేవత పక్షాన సూచించాల్సిన పరిష్కారం... ఇవే దృష్టిలోఉంటాయి. అవి మాత్రమే ఉండాలి కూడా! అప్పుడే 'జస్టిస్ అన్న మాటకి విలువ, గౌరవం, దాన్ని అందించిన రాజ్యాంగ నిబంధనకు సార్థకత!

ఇక్కడ రాజ్యాంగం గురించీ ఓ విషయం ప్రస్తావించి తీరాలి. భారతీయులుగా మనం గర్వంగా చెప్పుకోదగ్గ అంశాల్లో మన రాజ్యాంగం ఒకటి. అది కల్పిస్తున్న స్వేచ్ఛా,





రాష్ట్రపతి శ్రీ రామ్‌నాథ్ కోవింద్‌తో జస్టిస్ ఎన్.వి. రమణ దంపతులు





సమానత్వాలు కేవలం భావనలు కావు... ఆచరణాత్మక సూచనలు. వాటివల్లే ఎక్కడో ఓ మారుమూల పల్లెలో... ఓ మామూలు వ్యవసాయ కుటుంబంలో... గుడ్డి దీపం వెలుతురులో చదువుకున్న నేను దేశ న్యాయవ్యవస్థకి సారథ్యం వహించే స్థాయికి చేరగలిగానన్నది కాదనలేని నిజం.'

ధర్మమార్గాన్ని వీడని వ్యక్తిత్వం

దేశ అత్యున్నత న్యాయస్థానంలో ప్రధాన న్యాయమూర్తి కావడం గొప్ప విషయమే. కానీ, ఎదుగుదల అంటే ఉన్నత పదవీ, హోదా మాత్రమే కాదు... ఎలాంటి పరిస్థితుల్లోనూ ధర్మమార్గాన్ని వీడని మనిషిగా ఎదగడం. ఆ ఎదుగుదల వెనుక ఆ వ్యక్తి సంకల్పం, భగవంతుడి అనుగ్రహంతో పాటు ఎందరివో ఆశీస్సులూ, శుభకామనలూ ఉంటాయి. నా జీవితమూ అందుకు అతీతమేం కాదు.

నన్ను లాయరుగా చూడాలని కలలుగన్న అమ్మానాన్నా, సొంత బిడ్డలా ఆదరించి నావృత్తి జీవితానికి గట్టి పునాది వేసిన అయ్యపురెడ్డి, నా కెరీర్ని మలచిన పి.సి. రావు, పని ఒత్తిడితో సతమతమయ్యే నన్ను కనురెప్పలా కాచుకున్న నా శ్రీమతి శివమాల, ఇంకా– పేరు పేరునా పరిచయం సాధ్యంకాని మరెందరో ఆత్మీయులూ మిత్రులూ... ప్రత్యక్షంగానో పరోక్షంగానో నా ఉన్నతికి దోహదపడిన వారే! వారందరికీ నా కృతజ్ఞతాంజలి!

రైతన్న బాధలు తెలిన వ్యక్తి

జస్టిస్ రమణకు ఒక రైతు కష్టాలేమిటో పూర్తిగా తెలుసు, 'రైతు బిడ్డ నేకదా, పొలంపనులు చేయకపోతే ఎలా? చిన్నప్పుడు కళ్లాలకు కాపలా ఉండేవాడిని, పొగాకు నాట్ల సీజన్ నుంచి అమ్మకాల వరకూ అన్ని పనులను చూసేవాడిని. ఒక రైతు బాధలేమిటో నాకు ప్రత్యక్షంగా తెలుసు. పొగాకు కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వని వ్యాపారుల నుంచి డబ్బులు రాబట్టేందుకు తీవ్ర ప్రయత్నాలు చేసిన రోజులున్నాయి' అని ఆయన అన్నారు.

తండ్రి ప్రోత్సాహంతోనే..

'వివాదాలు, తగాదాలు నాకు పెద్దగా ఇష్టం ఉండవు. సాధ్యమైనంత సానుకూలంగానో, ఉదారవాద దృక్పథంతోనో సమస్యల్ని పరిష్కరించుకోవాలని నేను భావిస్తాను.. అని ఆయన చెప్పారు. ఇలాంటి సున్నితమైన మనస్తత్వం ఉన్న జస్టిస్ రమణను న్యాయవాద వృత్తిలో వెళ్లమని తండ్రి ప్రోత్సహించారు. చాలా కాకతాళీయంగా ఒక గమ్యాన్ని అన్వేషిస్తూ ఈ వృత్తిలోకి రావడం జరిగింది అని ఆయన చెప్పారు. అలాంటి వ్యక్తి ఇవాళ న్యాయవ్యవస్థలో అత్యున్నత స్థానానికి ఎదుగుతారని నాడు ఎవరూ ఊహించలేదు.



గాంధీ పుస్తకం చదివి...

కంచికచర్లలో మంచి లైబ్రరీ ఉండేది. స్కూలులో కూడా గ్రంథాలయం ఉండేది. గ్రంథాలయమే ఆయన జీవితానికి బలమైన పునాది వేసింది. 'చిన్నప్పుడు లైబ్రరీలో ప్రవేశించగానే బాలల బొమ్మల మహాత్మాగాంధీ పుస్తకం. అది చదువుతుంటే ఒక రకమైన దేశ భక్తి నాలో ఉప్పొంగింది. దేశానికి ఏమైనా చేయాలన్న ప్రేరణ, భావావేశం ఆ పుస్తకం కలిగించింది..' అని చెప్పారాయన. పొద్దున్నుంచీ సాయంత్రం వరకు పేపర్లనుంచి పుస్తకాల వరకూ అన్నీ చదవడం, ఆంధ్రపత్రిక, విశాలాంధ్ర పత్రికలు, చందమామ, బాలమిత్ర ఆయన లో పఠనాసక్తిని, సామాజిక స్పృహను ఏర్పరిచాయి.

పదవతరగతిలో శ్రీశ్రీ ప్రభావం

పదవ తరగతి చదువుతుండగా ఒక రోజు శ్రీశ్రీ మహాప్రస్థానం ఆయన కంట పడింది. 'ఎముకలు కుళ్లిన, వయస్సు మళ్లిన సోమరులా చావండి. నెత్తురు మండే శక్తులు నిండే సైనికులారా రారండి హరోం హరా అని కదలండి.." అని చదువుతుంటే శరీరం అంతా వేడెక్కి మరో ప్రపంచంలోకి అడుగుపెడుతున్నట్లనిపించింది. 'పొలాలనన్నీ, హలాల దున్నీ ఇలా తలంలో హేమం పిండగ, జగానికంతా సౌఖ్యం పండగ, విరామమెరుగక పరిశ్రమించే, బలం ధరిత్రికి బలి కావించే కర్షక వీరుల కాయం నిండా కాలువ కట్టే ఘర్మ జలానికి ఖరీదు లేదోయ్' అనిశ్రమ జీవి చెమటకు ఖరీదు కట్టే వారు లేరని శ్రీశ్రీ వర్ణిస్తుంటే ఉత్తేజం కలిగింది. ఏక బిగిన మహాప్రస్థానం చదివాను.." అని ఆయన చెప్పారు. ఆ ప్రభావంతోనే జస్టిస్ రమణ ప్రగతి శీల, అభ్యుదయ సాహిత్యాన్ని చదవడం ప్రారంభించారు.

దిగంబర కవిత్వం ఆకర్షించింది.

'సామాజిక పరిణామంలో భాగంగా తెలుగు సాహిత్యాన్ని అధ్యయనం చేస్తే తప్ప దాని విశిష్టత అర్థం కాదని నేను క్రమంగా తెలుసుకున్నాను. అని ఆయన చెప్పారు. 'దిగంబర కవితా ఉద్యమం నన్ను ఎంతో ఆకర్షించింది. ముఖ్యంగా జ్వాలాముఖి కవిత్వం, వాగ్ధాటి గొప్పగా అనిపించేవి' అని ఆయన వెల్లడించారు. కందుకూరి వీరేశలింగం రాజశేఖర చరిత్ర, గురజాడ కన్యాశుల్కం. గుర్రం జాషువా గబ్బిలం నుంచి రాచకొండ విశ్వనాథ శాస్త్రి ఆరు సారా కథల వరకు ఆయన చదవని పుస్తకం అంటూ లేదు. 'మంచి అన్నది మాల అయితే మాల నేనగుదున్' అని గురజాడ అప్పారావు రాసిన వాక్యాలను ఆయన ఉటంకించారు. 'రాజు మరణించేనొక తార రాలిపోయె, కవియు మరణించే నొక తారగగన ఎక్కె రాజు జీవించే రాతి విగ్రహములందు, సుకవి జీవించే ప్రజల నాలుకల యందు' అని ఫిరదౌసిలో జాషువా చెప్పిన మాటలు నేటికీ అక్షర సత్యాలేనని, కఠిన వాస్తవాలు ఆయన రచించారని అన్నారు.

స్త్రీ పురుష సంబంధాలను అద్భుతంగా అభివర్ణించిన చలం నవలలు, కథలు, ఉప్పల



లక్ష్మణరావు అతడు–ఆమె, రంగనాయకమ్మ, ఓల్గా రచనలు, శరత్ సాహిత్యం, ప్రపంచంలో ఉత్తమ రచనలైన చెఖోవ్ సాహిత్యం, గోర్కీ 'అమ్మ', ఆఫ్రికన్ పోరాట సాహిత్యం కూడా జస్టిస్ రమణ చదివారు. ప్రేమ్ చంద్, కిషన్ చందర్ కథలు, నవలలను కూడా ఆయన గుర్తు చేసుకున్నారు. 'కిషన్ చందర్ 'ఐదుగురు లోఫర్లు' పుస్తకాన్ని నిడమర్తి ఉమారాజేశ్వరరావు అద్భుతంగా అనువదించారు' అని ఆయన చెప్పారు. మొక్కపాటి నరసింహం రాసిన బారిస్టర్ పార్వతీశం, పానుగంటి లక్ష్మీనరసింహారావు సాక్షి ఉపన్యాసాలు, వట్టికోట ఆళ్వారుస్వామి ప్రజల మనిషి తనకు నచ్చిన పుస్తకాలు అని ఆయన తెలిపారు.

'ప్రముఖ సాహిత్య విమర్శకుడు వెల్చేరు నారాయణరావు రచించిన 'తెలుగులో కవితా విప్లవాల స్వరూపం' గొప్పసాహిత్య విమర్శనా గ్రంథం' అని ఆయన చెప్పారు.

మాండలిక భాష లో రచనలంటే కూడా జస్టిస్ రమణ ఇష్టపడతారని చాలా మందికి తెలియదు. సున్నితమైన హాస్యంతో ప్రజల భాషలో రాసి నామిని సుబ్రహ్మణ్యం నాయుడు సిన్నబ్బ కథలు, మిట్టూరోడి కథలు, ఒక లంబాడీ తల్లి దైన్యాన్ని దయనీయంగా చిత్రించిన సుద్దాల అశోక్ తేజ రాసిన పాటలు తన మనసుకు హత్తుకున్నాయని ఆయన చెప్పారు.

వరంగల్‌కు చెందిన సారంగపాణి జానపద గీతాలు తనకు ఎంతో ఇష్టమన్నారు.

ప్రాచీన సాహిత్యపు లోతులు కూడా...

'ఒక్కసారి సాహిత్యం రుచి పడ్డ తర్వాత, అక్షరం అంటే ప్రేమ ఏర్పడిన తర్వాత ఆ అభిరుచి ప్రాచీన, ఆధునిక సాహిత్యాల మధ్య తేడా చూడదు. అయితే సామాజిక చైతన్యం అంటూ ఏర్పడితే అది సాహిత్యాన్ని సరైన అవగాహనతో అర్థం చేసుకునేలా చేస్తుంది' అని జస్టిస్ రమణ వ్యాఖ్యానించారు.

రామాయణ, మహాభారతాలను ఉత్తమ కావ్యాలుగా ఆయన అభివర్ణించారు. 'త్రేతాయుగం కాలానికి చెందిన శ్రీరాముడి గురించి ఇవ్వాల్టికి చదివినా నిత్యనూతనంగా అనిపిస్తుందన్నారు.

సుందరాకాండలో వాల్మీకి సీత వ్యక్తిత్వాన్ని అద్భుతంగా చిత్రించారని జస్టిస్ రమణ చెబుతుంటే ఆశ్చర్యం కలిగింది.

'నిధి చాలా సుఖమా, రాముని సన్నిధి సేవ సుఖమా అన్నారు త్యాగయ్య. 'మరల రామాయణంబన్నచో నిదేల ఈ ప్రపంచకమెల్ల ఎల్లవేళల తినుచున్న అన్నమే తినుచున్నదిన్నాళ్లు' అన్నారు విశ్వనాథ తన 'రామాయణ కల్పవృక్షంలో' అని జస్టిస్ రమణ చెప్పారు.

'అల్ల కర్ణాట కరాట కీచకులకు అమ్మ త్రిశుద్ధిగ నమ్మ భారతీ' అన్న పోతన భాగవతం భక్తి సాహిత్యానికి పరాకాష్ట అని ఆయన అన్నారు. 'డబ్బు, విద్య, ఉత్తమ వంశం, దుర్బుద్ధి కలిగిన వారికి మదాన్ని కలిగిస్తాయి. ఇవే సజ్జనులకు అణకువనూ, గౌరవాన్ని తెచ్చి



పెడతాయి' అని మహా భారతంలోని ఉద్యోగ పర్వంలో విదురుడి నీతి వాక్యాలు సమకాలీన సమాజానికీ వర్తిస్తాయని ఆయన చెప్పారు.

'తెలుగు సాహిత్యానికి ఘనమైన చరిత్ర ఉన్నది. సమాజాన్ని ప్రశ్నించే తత్వం ఉన్నది. ఎక్కడా రాజీపడని ఆలోచనా ధోరణి తెలుగు సాహిత్యంలో మనకు కనపడుతుంది. విశ్వనాథ 'వేయిపడగలు' కూడా సామ్రాజ్యవాదాన్ని 'ప్రశ్నించింది' అని ఆయన చెప్పుకుంటూ పోయారు. వేమన తన పద్యాల్లో ప్రజల భాషల్లో మూఢనమ్మకాలను ప్రశ్నించారని చెప్పారు.

స్వప్నంలో కూడా తట్టిలేపేది సాహిత్యమే

'మనం రోజూ చదివే వార్తల్లో ఏమున్నది. ఒకసారి చదివిన తర్వాత మరిచిపోతాం. కాని ఉత్తమ సాహిత్యం చదివితే మనలో ప్రకంపనలు సృష్టిస్తుంది. నిద్రిస్తున్నా స్వప్నంలో తట్టిలేపుతుంది. మనలో ప్రతిధ్వనిస్తుంది. అని ఆయన చెప్పారు. కవిత్వం ఎటువంటిదంటే 'చావుబ్రదుకుల సంధ్యాకాలంలో కన్నులు మూసిన రోగార్తుని రక్తనాళ సంస్పందన' అని శ్రీశ్రీ వాక్యాల్ని ఒక మెడికల్ కాలేజీ ప్రసంగంలో ఒక చోట ఉటంకిస్తే విద్యార్థులంతా ఆశ్చర్యపోయారని జస్టిస్ రమణ అన్నారు. సామాజిక చైతన్యం రేకెత్తించడంలో సాహిత్యం కీలక పాత్ర పోషిస్తుంది. నాకు ఒక సామాజిక దృక్పథం ఏర్పడడానికి, సమాజం పట్ల, ప్రజల సమస్యల పట్ల ఒక అవగాహన ఏర్పడడానికి నేను విస్తృతంగా సాహిత్యాన్ని ముఖ్యంగా తెలుగు సాహిత్యాన్ని అధ్యయనం చేయడమే కారణం...' అని ఆయన చెప్పారు. అవధానం ఇష్టమైన ప్రక్రియ

మరే భాషలో లేని అత్యుత్తమ సాహితీ ప్రక్రియ అవధానం తెలుగులో ఉన్నదని అనుకున్నప్పుడల్లా తనకు గర్వం కలుగుతుందని ఆయన అన్నారు. గరికపాటి నరసింహారావు, మేడసాని మోహన్, మాడుగుల నాగఫణి శర్మ అవధానాలంటే జస్టిస్ రమణకు ఎంతో ఇష్టం. తెలుగు పద్యం, భాష సజీవంగా ఉండేందుకు వీరు కారకులు అని ఆయన అన్నారు. గరికపాటి ప్రవచనాలన్నా తాను ఇష్టపడతానని, ఆయన, ఉన్నది ఉన్నట్లు నిర్మొహమాటంగా మాట్లాడతారని, ఒకరిని సంతృప్తి పరిచేందుకు ఆయన ప్రవచనాలు చెప్పరని జస్టిస్ రమణ ప్రశంసించారు.

తాత్విక దృక్పథం

సూర్యదేవర సంజీవ దేవ్ తాత్విక దృక్పథం జస్టిస్ రమణలో ఎనలేని ప్రభావాన్ని చూపింది. తత్వవేత్త, రచయిత, చిత్రకారుడు అయిన సంజీవదేవ్ రచించిన 'తెగిన జ్ఞాపకాలు' జస్టిస్ రమణకు ఎంతో ఇష్టమైన పుస్తకం. 'ఆంతరంగిక ఆలోచనలను లిఖిత రూపంలో వ్యక్తం చేయడంలో ఆయనకు ఆయనే సాటి' అని జస్టిస్ రమణ అన్నారు.

సంజీవ దేవ్ రచనలు చదవడం వల్ల బుచ్చిబాబు, గోపీచంద్, జిడ్డుకృష్ణమూర్తి, బెట్రండ్ రస్సెల్, రాహుల్ సాంకృత్యాయన్ లాంటి వారిని అధ్యయనం చేయాలన్న కోరిక



గలిగిందని ఆయన చెప్పారు.

'ఏ ప్రాంతమూ పరాయిది కాదు. ఏ మనుషులూ పరాయివారు కారు' అన్నవసుధైక కుటుంబాన్ని సంజీవదేవ్ ఆచరించారు' అని తెలిపారు. గోపీచంద్ అసమర్థుడి జీవయాత్ర, బుచ్చిబాబు చివరకు మిగేలిది. విశ్వనాథ చెలియలికట్ట, తాత్విక రచనలేనని ఆయన అన్నారు. కారల్ మార్క్స్ సైద్ధాంతిక రచన 'కాపిటల్'ను పరిచయం చేస్తూ రంగనాయకమ్మ రాసిన 'పెట్టుబడి' పుస్తకాన్ని కూడా చదివానని ఆయన చెప్పారు.

తెలుగు భాష అంటే ప్రాణం

'నా దృష్టిలో తెలుగు భాష కంటే తీయని భాష మరొకటి లేదు' అని ఆయన అన్నారు. 'ఢిల్లీలో ఉన్నా, విదేశాల్లో ఉన్నా ఎవరైనా తెలుగు మాట్లాడుతుంటే విని ఒళ్లు ఉప్పొంగుతుంది. 'అని ఆయన చెప్పారు. కన్నతల్లి ఎంత ముఖ్యమో తల్లి భాష కూడా అంతే ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. మన భాష గొప్పతనాన్ని ప్రజలకు తెలియజేసి దాన్ని కాపాడుకోవాలని చెప్పారు.

ఎన్ని ఆంగ్ల రచనలు చదివినా, తెలుగులో వాటి అనువాదాలు చదివితే వచ్చే తృప్తే వేరు. ప్రపంచంలోని ఉత్తమ రచనలు తెలుగులో రావాలి, తెలుగులో ఉత్తమ రచనలు ఇతర భాషల్లోకి అనువాదం కావాలి..' అని ఆయన అన్నారు.

'తెలుగు బిడ్డడవయ్యు తెలుగు రాదంచును సిగ్గులేక ఇంక చెప్పుటందుకురా, అన్యభాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు సకిలించు ఆంధ్రుడా, చావవెందుకురా." అని కాళోజీ 'నా గొడవ'లో చెప్పిన వాక్యాలను ఆయన గుర్తు చేశారు.

న్యాయస్థానాల్లో తెలుగును పటిష్టంగా అమలు చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. తన తీర్పులకు రాని ప్రాచుర్యం తెలుగు భాష గురించి మాట్లాడినప్పుడు వచ్చిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

'మాతృభాష ఒక జాతి ఔన్నత్యానికి ప్రతీక. తెలుగువాడు భాషాభిమానే కాని దురభిమాని కాదు. భాషను కాపాడుకుంటూ అబివృద్ధి చేసుకోవడం జరగాలి. భాషను, సంస్కృతీ సంప్రదాయాలను మమేకం చేయగలగటం తెలుగునుడి ప్రత్యేకత' అని ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో చెప్పానని ఆయన గుర్తు చేసుకున్నారు.

బాలమురళి కౌగలించుకున్న న్యాయమూర్తి

గద్దర్, వంగపండు వంటి ప్రజాకళాకారులు జనాన్ని ఉర్రూతలూగిస్తుంటే జస్టిస్ రమణ మైమరిచిపోయిన రోజులు కూడా ఉన్నాయి. ఆ రోజుల్లో సలాది భాస్కరరావు సామాజిక అంశాలపై అద్భుతంగా చెప్పే హరికథలు కూడా ఆయనను ఆకర్షించేవి. రాను రానూ కర్ణాటక సంగీతంలో కూడా అభిరుచి పెరిగి ఒక మహాశివు డనదగ్గ బాలమురళీ కృష్ణ గాన ప్రవాహంలో కూడా ఆయన మునిగిపోయారు.



బాలమురళి గురించి ఆయన ఒక ఆసక్తికరమైన ఘట్టాన్ని వివరించారు.

"ఒకసారి బాలమురళిని సన్మానించే అదృష్టం నాకు దక్కింది. ఆయన నాకు నమస్కారం పెట్టారు. 'నాకు నమస్కారం మీరు పెట్టకూడదు. మీ కంటే నేను చిన్నవాడిని హోదా పరంగా నాకు ఒక స్థాయి ఉండవచ్చు కానీ, మీ ముందు అదెంత అని అన్నాను. 'అంతేకాదు, మిమ్మల్ని ఒకసారి ఆలింగనం చేసుకోవాలి కోరిక ఉన్నది' అని చెప్పేసరికి ఆయన 'సంతోషం' అంటూ మనసారా నవ్వి నన్ను గట్టిగా ఆలింగనం చేసుకుని నన్ను పునీతుణ్ణి చేశారు" అని జస్టిస్ రమణ వెల్లడించారు.

ప్రజల భాషకు పట్టం కట్టి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన అన్నమాచార్య పదకవితలు అంటే తనకెంతో ఇష్టమన్నారు. 'మెండైన బ్రాహ్మణుడు మెట్టు భూమి యొకటే–చండాలుండేటి సరిభూమి యొక్కటే' అని అన్నమాచార్య రాసిన కీర్తనల్లో అభ్యుదయ భావాలెన్నో ఎన్నాయని ఆయన చెప్పారు.

జస్టిస్ రమణకు కవులు, కళాకారులు అంటే ఎంత ఇష్టమంటే చాలా మంది కవులు, హరికథా కళాకారులకు తోచినంత ఆర్థిక సహాయం చేయడం, వారి పుస్తకాల ప్రచురణకు తోడ్పడం చేసి తృప్తి పడుతుంటారు. మన సాహిత్యాన్ని, మన సంగీతాన్ని మనం గౌరవించకపోతే వ్యక్తిగా ఎంత ఉన్నత హోదాలో ఉన్నా, మానసికంగా మనం ఉన్నతులు కాలేమన్నది ఆయన అభిప్రాయం.

అందరికీ అధ్యయనం ముఖ్యం

అధ్యయనం చేయకపోతే సమాజం ఎలా అర్థమవుతుంది? ఏ వృత్తిలో ఉన్నా మనిషికి ఉన్నత వ్యక్తిత్వం, ఒక దృక్పథం ఏర్పడాలంటే నిరంతర అధ్యయనం అవసరం. సాహిత్యమే కాదు, సామాజిక చరిత్ర కూడా అధ్యయనం చేయాలి' అని జస్టిస్ రమణ చెప్పారు. తాను గాంధీ, నెహ్రూ లాంటి వారి ఎందరో జీవిత చరిత్రలను చదివానని, లెనిన్, స్టాలిన్, నెల్సన్ మండేలా, మార్టిన్ లూథర్ కింగ్‌ల గురించి కూడా తెలుసుకున్నానని తెలిపారు. మొరార్జీ దేశాయ్ రచించిన 'ఏ స్టోరీ ఆఫ్ మై లైఫ్' పివి నరసింహారావు రచించిన 'ఇన్ సైడర్' కూడా ఆయన చదివారు. న్యాయవాద వృత్తిలో ఉన్నవారికి అధ్యయనం లోతైన పరిజ్ఞానాన్ని కల్పిస్తుందని ఆయన చెప్పారు.

'రావిశాస్త్రి ఆరుసారా కథలు చదివితే న్యాయ వ్యవస్థ సాగుతున్న తీరు మనకు అర్థమవుతుంది. పిచ్చెక్కిన న్యాయమూర్తిని ప్రమాదంలో పడబోతున్న న్యాయవ్యవస్థకు ప్రతీకను చేసి రావాల్సిన సంస్కరణలను ఆ పాత్ర ద్వారా ముందుతరాలకు సూచించి రావిశాస్త్రి మనకు మార్గదర్శనం చేశారని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పుస్తకాన్ని నేను ప్రచురణలకర్తల వద్ద అనుమతి తీసుకుని కొన్ని వందల కాపీలు రీ ప్రింట్ చేసి న్యాయవాదులకు, న్యాయమూర్తులకు పంచిపెట్టాను' అని ఆయన వెల్లడించారు.

రావిశాస్త్రి చెప్పినట్లే మన సమాజంలో కొన్ని వ్యవస్థీకృత లోపాలున్నాయి. కాదనలేము.



కోర్టులు, న్యాయం అనేది అందని ద్రాక్షపండుల్లా ఉండకూడదనేదే నా అభిప్రాయం కూడా' అని జస్టిస్ రమణ చెప్పారు. మన కోర్టుల్లో న్యాయవాదుల ద్వారానే కథ నడుస్తుందని, దీని వల్ల అన్యాయాలు, కేసులు ఆలస్యం కావడాలు జరుగుతుంటాయని రావిశాస్త్రి రాశారని ఆయన తెలిపారు. 'అలా అన్యాయానికి గురైన వారిని చూస్తే బాధ కలుగుతుంది. వీలైనంత వరకు ఏదో ఒకటి చేయాలన్న తపన ఉంటుంది. వ్యక్తులుగా ఈ పరిస్థితిని సరిదిద్దేందుకు, వ్యవస్థలో మార్పులు తీసుకువచ్చేందుకు నిరంతరం ప్రయత్నిస్తూనే ఉండాలి' అని ఆయన అభిప్రాయపడ్డారు.

పౌరాణిక సినిమాలు అంటే ఇష్టం

'నాకు సినిమాలంటే పెద్దగా అభిరుచి లేదు కాని స్వర్గీయ నందమూరి తారకరామారావు నటించిన పౌరాణిక సినిమాలు అంటే ఎంతో ఇష్టం. శ్రీకృష్ణుడుగా, శ్రీరాముడుగా మాత్రమే కాదు, రావణ బ్రహ్మగా, సుయోధన సార్వభౌముడుగా ఆయన నటన విశ్వరూపాన్ని సినిమాల్లో చూసినప్పుడు ఎంతో ఆనందం కలుగుతుంది. ఎస్వీరంగారావు అద్భుత నటనా కౌశలం చూసినప్పుడు కూడా నాకు శరీరం ఉప్పొంగుతుంది. మాయాబజార్‌లో ఆయన ఘటోత్కచుడుగా తన ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పారు." అని ఆయన చెప్పారు. జానపద గీతాల్లో లాలిత్యాన్ని, వ్యంగ్య, హాస్యభరితమైన సాహిత్యాన్ని తెలుగు సినిమాల్లో ప్రవేశపెట్టిన ఘనత కొసరాజు రాఘవయ్యకు దక్కుతుంది. ఆయన 'ఏరువాకా సాగారో రన్నో చిన్నన్నా, మత్తు వదలరా, నిద్దుర మత్తు వదలరా.' మొదలైన అనేక అద్భుతమైన పాటలు రాశారని చెప్పారు. శ్రీశ్రీ, దాశరథి, దేవులపల్లి కృష్ణశాస్త్రి, సినారె, ఆరుద్ర తదితరులు తమ సాహితీ ప్రతిభను సినీరంగానికి కూడా అందించారని ఆయన అన్నారు.

★ ★ ★







అమరావతి శంకుస్థాపన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, నారా చంద్రబాబునాయుడు, కేసీఆర్‌లతో....



శ్రీకాకుళంలో కాసుల పురుషోత్తమ కవి విగ్రహం వద్ద జస్టిస్ రమణ దంపతులు.
చిత్రంలో సిరివెన్నెల సీతారామశాస్త్రి, మండలి బుద్ధప్రసాద్



ఆంధ్రత్వం మూర్తీభవించిన తేటతెనుగు మనసు
జస్టిస్ ఎన్. వి. రమణ

- డా. మండలి బుద్ధప్రసాద్

జస్టిస్ నూతలపాటి వెంకటరమణ సర్వోన్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన సందర్భంలో యావత్తు తెలుగుజాతి ఒక తెలుగుబిడ్డ న్యాయశిఖరాన్ని అధిరోహించినందుకు గర్వించింది. తనను తాను తెలుగువాడినని సగర్వంగా చెప్పుకోవటమే కాకుండా తెలుగు భాషపై అపారమైన ప్రేమాభిమానాలను పలు సందర్భాల్లో ప్రకటించుకున్నవారాయన.

2012 డిసెంబరులో తిరుపతి 4వ ప్రపంచ తెలుగు మహాసభల నేపథ్యంలో జస్టిస్ రమణగారు ఒక దినపత్రికలో వ్రాసిన వ్యాసం నన్నెంతగానో ఆకట్టుకుంది. ఆనాడు అధికారభాషా సంఘం అధ్యక్షునిగా 'పరిపాలనలో తెలుగు' గురించి ఎక్కువ దృష్టిపెట్టి పనిచేస్తున్న నాలో ఆ వ్యాసం "న్యాయపాలనలో తెలుగు" గురించి కొత్త ఆలోచనలు రేకెత్తించింది కూడా!

తీర్పులు, సాక్ష్యాలు, వాదప్రతివాదాలు మాతృభాషలో జరిగితే కక్షిదారుడు నిస్సంకోచంగా న్యాయవిచారణలో పాల్గొని, తన వాదనలో లోటుపాట్లు అర్థం చేసుకుని అవసరమైన పక్షంలో రాజీగా వివాద పరిష్కారానికి చర్య తీసుకోవటం జరుగుతుంది. ప్రజలకు చేరువ కాలేకపోతే న్యాయ ప్రక్రియ పేలవమయ్యే ప్రమాదం ఉంది. దీన్నుంచి న్యాయప్రక్రియను కాపాడుకోవలసిన గురుతర బాధ్యత మనపై ఉందని జస్టిస్ రమణగారు ఆ వ్యాసంలో పేర్కొన్నారు. ఆ సమయంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగానూ, జ్యుడిషియల్ అకాడెమీ అధ్యక్షునిగా కూడా ఉన్నారాయన.

ఈ వ్యాసం చదివాక వారిని వెళ్లి కలిశాను. వారు కృష్ణాజిల్లా వారే అయినా అంతకు మునుపు నాకు పెద్దగా పరిచయం లేదు. వారితో మాట్లాడిన తరువాత ఆయన చేతల మనిషని అర్థం అయ్యింది. ఆంధ్రప్రదేశ్ జ్యుడిషియల్ అకాడెమీ, ఆంధ్రప్రదేశ్ అధికారభాషా సంఘం సంయుక్తంగా "తెలుగులో న్యాయపాలన" అంశం మీద ఒక సదస్సు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నాం.

2013 ఫిబ్రవరి 10న హైదరాబాద్ జూబ్లీ హాలులో సదస్సు విజయవంతంగా జరిగింది. నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్రఘోష్, ఇంకా హైకోర్టు, జిల్లా కోర్టుల న్యాయమూర్తులు, మంత్రులు, అధికారులు పాల్గొన్నారు. యావత్ కార్యక్రమం జస్టిస్





రమణగారి కనుసన్నల్లో జరిగింది. బ్రిటిష్ కాలంలోనూ, నిజాం కాలంలోనూ తెలుగులో వెలువడిన తీర్పులు సేకరించి ఒక ప్రదర్శన ఏర్పాటు చేయించారు. జస్టిస్ రమణగారి స్ఫూర్తితో ఆ యేడాది వివిధ న్యాయమూర్తులు 50కి పైగా తీర్పులను తెలుగులో ప్రకటించారు.

గౌరవనీయ ప్రధాన న్యాయమూర్తితో సంప్రదించిన మీదట, హైకోర్టు న్యాయమూర్తి అధ్యక్షులుగానూ, అధికార భాషా సంఘం అధ్యక్షులు, జ్యుడిషియల్ అకాడెమీ సంచాలకులు, సాధారణ పరిపాలనా శాఖ కార్యదర్శి (రాజకీయ), న్యాయశాఖ కార్యదర్శి, రాష్ట్ర బార్ కౌన్సిల్ అధ్యక్షులు సభ్యులుగా ఒక ప్రాధికార కమిటీని నియమించాలని ప్రతిపాదించారు. కానీ అది ఆచరణలోకి రాలేదు.

తెలుగులో న్యాయ సాంకేతిక పరిజ్ఞానము, న్యాయభాష పదకోశాలు ప్రతీ న్యాయస్థానానికి అందుబాటులోకి రావాలని, ప్రభుత్వం వెలువరించే చట్టాలు, ఉత్తర్వులు మొదట తెలుగులోనే సమాజానికి వెల్లడి కావాలని, ప్రతీ న్యాయస్థానంలో తెలుగు క్లుప్త లిఖి లేఖకుల ఏర్పాటు ఉండాలని రాష్ట్ర జ్యుడిషియల్ అకాడెమీ తనవంతు పాత్ర నిర్మాణాత్మకంగా పోషిస్తుందనీ జస్టిస్ రమణ చెప్పారు. వారి సూచనల మేరకు న్యాయపాలనా రంగంలో తెలుగు అమలు కోసం కంప్యూటర్లలో తెలుగు సాఫ్ట్ వేర్ని, కొన్ని ఫాంట్లను అంతర్జాలం ద్వారా పదకోశాలను ఆంధ్రప్రదేశ్ సమాచార సాంకేతిక శాఖ ద్వారా తయారు చేయించటం జరిగింది.

భారత రాజ్యాంగంలోని 348వ అధికరణం ప్రకారం రాష్ట్రాలలోని హైకోర్టులలో న్యాయప్రక్రియ తప్పనిసరిగా ఇంగ్లీషులోనే జరగాలని పేర్కొంటూ, క్రింది కోర్టులైన సెషన్స్, మేజిస్ట్రేట్ కోర్టులలో భాషని నిర్దేశించే అధికారం క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 272 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చింది. ఆ మేరకు మన ప్రభుత్వం 1914లో జి.వో.ఎం.ఎస్ నెం. 485 ద్వారా క్రిమినల్ కోర్టులలో కార్యకలాపాలు తెలుగులోను,



ఇంకా ఇతర స్థానిక భాషలలోనూ జరపవచ్చనే వెసులుబాటు కల్పించింది.

దురదృష్టవశాత్తూ, ఇంతలో రాష్ట్రవిభజన ముంచుకు వచ్చింది. నేను అధికార భాషాసంఘ అధ్యక్ష బాధ్యతల నుండి వైదొలిగాను. జస్టిస్ రమణగారు పదోన్నతిపై ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా వెళ్లారు. రాష్ట్రంలో అనుకూల పరిస్థితులు కొరవడటంతో ఆనాటి మా కృషి ఏదీ వెలుగులోకి రాకుండాపోయింది.

కాని, జస్టిస్ రమణగారి భాషాభిమానమూ, భాషాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషిచేయాలన్న వారి సంకల్పమూ నన్నెంతో ప్రభావితుణ్ణి చేశాయి. అప్పటినుండీ భాషకు సంబంధించిన సభలు జరిగినప్పుడు తప్పనిసరిగా వారిని ఆహ్వానించే వాళ్లము. వారు పాల్గొని భాషాభిమానులను ఉత్తేజితులను చేసేవారు.

"కన్నతల్లి, పుట్టిన ఊరు, తల్లి భాష ప్రతీ వ్యక్తి జీవితంలో అత్యంత ముఖ్యమైనవి. విద్యార్థి దశలో మాతృభాషలో విద్యార్జన అనివార్యమని, అది భావి జీవితానికి గట్టి పునాది వేస్తుందని ఆయన అంటారు. "ఎన్ని భాషలు నేర్చిన వ్యక్తి అయినా మాతృభాషకే ప్రాముఖ్యం ఉంటుంది. మాతృభాష విలువను తెలుసుకుని గౌరవించటం అనేది మన ప్రాథమిక బాధ్యత" అని రమణగారు తన ప్రసంగాలలో పదే పదే చెప్తుంటారు.

వారు సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయిన తరువాత ఢిల్లీలో వారి నివాస గృహం వద్ద నామఫలకంపై తెలుగులో తన పేరు వ్రాయించటం వారి మాతృభాషాభిమానానికి అద్దం పడుతుంది. ఢిల్లీలో తెలుగు అక్షారాలను చూసి మురిసిపోయిన వారెందరో....

తెలుగు సాహిత్యం అంటే రమణగారికి పరమప్రీతి. ప్రత్యేకించి రావిశాస్త్రి గారి ఆరుసారా కథలు ఆయనకు కంఠోపాఠం. చాలా సభలలో వాటిని వినిపించేవారు. న్యాయరంగంలో ఉన్నవారు తప్పనిసరిగా రావిశాస్త్రిని చదివితే సామాన్యుడికి న్యాయం అందచేయటం ఎలాగో తెలుస్తుందనే వారాయన.

ఇటీవల భారత సుప్రీకోర్టు తన తీర్పులను వివిధ ప్రాంతీయ భాషల్లోకి తర్జుమా చేసి, అధికారిక వెబ్ సైట్లలో పదిలపరచాలన్న నిర్ణయం వెనుక జస్టిస్ రమణ ఉన్నారని వేరుగా చెప్పనక్కర లేదు.

2019 డిసెంబర్ 27, 28, 29 తేదీలలో విజయవాడలో ప్రపంచ తెలుగు రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన 4వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు పంపించిన సందేశంలో ఆయన మాతృభాష ఉన్నతి గురించి చెప్పిన విషయాలు గొప్పవి. "ఒక జాతి ఔన్నత్యానికి మాతృభాష ప్రతీక. తెలుగువాడు భాషాభిమానేగానీ దురభిమాని కాడు. భాషను కాపాడుతూ, అభివృద్ధి సరిచేసు కోవాలి. మన భాష గొప్పదనాన్ని ప్రజలకు వెల్లడించి, తర్వాతి తరాలకు వారసత్వంగా అందజేసి, భాషా సౌందర్యాన్ని సుసంపన్నం చేయాలి" అని అభిలషించారు. భాషనూ, సంస్కృతీ సంప్రదాయాలను మమేకం చేయగలగటం తెలుగునుడి ప్రత్యేకత" అంటారాయన.



"భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుతో తెలుగు రాష్ట్రాలేర్పడిన తర్వాత గత కొన్నాళ్లుగా మన భాష ఉనికి మీద పరోక్షదాడులు జరుగుతున్నాయి. ఒక సజీవ వాఙ్మయ సౌందర్యానికి సమాధులు కట్టే దుశ్శకునాలు కనిపించటం దురదృష్టకరం. ఒక నిరంతర గంగా ప్రవాహానికి అడ్డుకట్ట వేయగలమా? అఖండ సూర్యకాంతిపుంజాన్ని అరచేతితో ఆపగలమా?" అని ఎంతో ఆవేదనగా ప్రశ్నించారాయన.

"తెలుగుభాష పరిఢవిల్లడానికి నిరంతరం శ్రమించాల్సిందే! ముఖ్యంగా న్యాయస్థానాలలో తెలుగును పటిష్టంగా అమలు చేయాలి. బ్రిటిష్ హయాంలోనే న్యాయమూర్తులు తెలుగులో తీర్పులు చెప్పిన చరిత్ర ఉంది. దీనిద్వారా ప్రజలందరికీ న్యాయవ్యవస్థ అందుబాటులోకి రాగలదు...." అని ఆ సందేశంలో ప్రకటించారాయన

భారత ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ రమణగారు తెలుగు జాతి గౌరవాన్ని పెంపొందిస్తారని నిస్సందేహంగా చెప్పుకోవచ్చు. కన్నతల్లిపై, కన్నభాషపై, కన్నదేశంపై మమకారం ఉన్నవారు ఏ పని చేసినా ఏ పదవి చేపట్టినా తమ ప్రత్యేకతను చాటుకుంటారు. వారి ఆలోచనా సరణి విశిష్టంగా ఉంటుంది.

జస్టిస్ రమణ గారిది "ఆంధ్రత్వం" మూర్తీభవించిన తేటతెనుగు మనసు. అలాంటి వ్యక్తి అత్యున్నత పదవిలోకి వచ్చినపుడు తెలుగు బిడ్డలు ప్రతి ఒక్కరూ పులకరిస్తారు.

★ ★ ★



జస్టిస్ ఎన్.వి. రమణ దంపతులను సత్కరిస్తున్న మండలి బుద్ధప్రసాద్



ప్రజల సీజేఐ జస్టిస్ ఎన్.వి. రమణ

జస్టిస్ ఎన్.వి. రమణ నిజమైన ప్రజల ప్రధాన న్యాయమూర్తి అని సుప్రీంకోర్టు కాబోయే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీ.ఆర్. గవాయ్ పేర్కొన్నారు. ఆయన బుధవారం సాయంత్రం ఇక్కడ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్ నాథ్‌తో కలిసి మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ ప్రసంగాల సంకలనంతో రూపొందించిన 'నెరేటివ్స్ ఆఫ్ ద బెంచ్, ఏ జడ్జ్ స్పీక్స్' పుస్తక విడుదల కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 'జస్టిస్ రమణను 2019 ఏప్రిల్‌లో తొలిసారి కలిశాను. మానవత్వం, సహానుభూతి, సంవేదనశీలత ఆయన తీర్పులు, ప్రసంగాల్లో ప్రతిబింబిస్తాయి. న్యాయమూర్తులు అంటే ప్రజలకు దూరంగా ఉంటారన్న భావనను దూరం చేసిన తొలి ప్రధాన న్యాయమూర్తి ఆయనే. సీజేఐగా పదోన్నతి పొందిన తర్వాత ఆయన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు వెళ్లినప్పుడు అక్కడి ప్రజలు, శ్రేయోభిలాషులు పలికిన స్వాగతాన్ని, చూపిన అభిమానాన్ని టీవీల్లో చూసి మేం నిజంగా నమ్మలేకపోయాం. కొవిడ్ పరిస్థితుల్లో ఆయన కేవలం 31-40 మంది సమక్షంలో ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే ఆయన పదవీవిరమణ చేసిన రోజు సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమానికి వచ్చిన అతిథులతో ఆడిటోరియంలోనే కాదు కారిడార్లలో కూడా కాలుపెట్టడానికి చోటులేకపోయింది.

వైవిధ్యం, సమ్మిళిత తత్వాన్ని నమ్ముతారు

జస్టిస్ ఎన్.వి.రమణ వైవిధ్యం, సమ్మిళిత తత్వాన్ని నమ్మే వ్యక్తి. ఆయన ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పుడు 9 మంది న్యాయమూర్తులు ప్రమాణ స్వీకారం చేశారు. అందులో మూడో వంతు మంది మహిళలతో పాటు బడుగు బలహీనవర్గాలు, షెడ్యూల్డ్ కులాల వారికీ అవకాశం కల్పించారు. ఒకేసారి ముగ్గురు మహిళా న్యాయమూర్తులు ప్రమాణస్వీకారం చేయడం సుప్రీంకోర్టు చరిత్రలో అదే ప్రథమం. ఆయన తన గుమస్తాలకు కూడా ఇళ్లు కట్టించి తన వద్దే ఉంచుకున్న సహృదయులు. కొవిడ్ లాక్‌డౌన్ సమయంలో ప్రజలకు న్యాయం అందించాలన్న లక్ష్యంతో తొలిసారి ఆన్‌లైన్‌కు వెళ్లిన సుప్రీంకోర్టు ధర్మాసనంలో జస్టిస్ ఎన్.వి.రమణ, జస్టిస్ సంజయ్‌కిషన్ కౌల్‌తో పాటు కూర్చొనే అదృష్టం నాకూ కలిగింది. చిట్టచివర ఉన్న వ్యక్తికి కూడా న్యాయవ్యవస్థ అందుబాటులో ఉండాలని ఆయన పరితపించారు. ప్రధాన న్యాయమూర్తి అంటే కేవలం సుప్రీంకోర్టుకు పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న న్యాయ వ్యవస్థను దృష్టిలో పెట్టుకొని పనిచేయాలని జస్టిస్ రమణ చెప్పారు. నేను సీజేఐగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన మార్గాన్ని అనుసరించడానికి ప్రయత్నిస్తాను' అని జస్టిస్ బీ.ఆర్. గవాయ్

పేర్కొన్నారు. జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ జస్టిస్ రమణ ప్రసంగాలతో కూడిన ఈ పుస్తకం సమాజ సేవకు అంకితమైన న్యాయ కోవిదుడి మనస్సు, సాధారణ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తుందన్నారు. న్యాయమూర్తులు కోర్టు గదులకు అతీతంగా ఒక అడుగు ముందుకేసి ప్రజలతో మమేకం కావాలన్న సందేశాన్ని ఈ పుస్తకం ఇచ్చినట్లు భావిస్తున్నానని పేర్కొన్నారు. జస్టిస్ విక్రమ్ నాథ్ మాట్లాడుతూ... సీజేఐ రమణ తన వ్యక్తిత్వంతో భారతీయ న్యాయ వ్యవస్థపై ప్రజలు కోల్పోతున్న నమ్మకాన్ని నిలబెట్టారని ఈ వ్యవస్థతో సంబంధం లేని ఒక మిత్రుడు తనకు పంపిన సందేశాన్ని చదివి వినిపించారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు, పలు హైకోర్టుల నుంచి 24 మంది న్యాయమూర్తులు, సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కపిల్ సిబల్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



జస్టిస్ ఎన్.వి. రమణ మాట్లాడుతూ న్యాయవ్యవస్థ కేవలం వివాదాలను పరిష్కరించే వ్యవస్థ మాత్రమే కాదని, అది రాజ్యాంగ నైతికతకు చిహ్నమని పేర్కొన్నారు. సాధారణ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే చిట్టచివరి వ్యవస్థ అని అభిప్రాయపడ్డారు. ప్రతి రోజూ దేశవ్యాప్తంగా వార్తాపత్రికలు మూడో వంతు స్థలాన్ని కోర్టు కార్యకలాపాలకు కేటాయిస్తుండటం దీని ప్రాధాన్యాన్ని తెలియజెబుతుందన్నారు. తాను ప్రతిపాదించిన నేషనల్ జ్యుడీషియల్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ అథారిటీ కలను నెరవేర్చాలని కాబోయే ప్రధాన న్యాయమూర్తులను కోరారు.

న్యాయమూర్తులు ఆస్తులు వెల్లడించడం మంచి పరిణామం


సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఆస్తులు వెల్లడించడం మంచి పరిణమమని జస్టిస్ ఎన్.వి.రమణ విలేకర్లతో చెప్పారు. న్యాయమూర్తులంతా ఆస్తులు ప్రకటించి, వెబ్‌సైట్‌లో ఉంచడం పారదర్శకతను తెలియజేస్తుందన్నారు. అమరావతి రైతులకు కోర్టు న్యాయం చేసిందా అన్న ప్రశ్నకు బదులిస్తూ వారికి తగిన న్యాయం జరిగిందని అనుకుంటున్నానని జస్టిస్ రమణ పేర్కొన్నారు.

★ ★ ★

మండలి ఫౌండేషన్


గాంధీక్షేత్రం, అవనిగడ్డ - 521 121, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్

1. శ్రీ మండలి బుద్ధప్రసాద్
2. శ్రీ మండలి సత్యప్రసాద్
3. శ్రీమతి పద్యాల అన్నపూర్ణ
4. శ్రీమతి మత్తి రేవతి
5. శ్రీ మండలి వెంకట్రామ్
6. శ్రీ మండలి ఫణి సాయి కృష్ణ
7. శ్రీమతి కమ్మిలి ఉజ్వల
8. శ్రీమతి హేమ కీర్తి
9. శ్రీమతి శీలం కృష్ణ ప్రభ
10. శ్రీమతి కనపర్తి అవనిజ
11. శ్రీమతి పూషడపు సింధురి



'మండలి' జీవిత ముఖ్య ఘట్టాలు

1.	జననం	4.8.1926
2.	ప్రాథమిక విద్య	1939–1945
3.	బందరులో కళాశాల విద్య	1946–1951
4.	వివాహం (భోగాది వెంకట్రామయ్య గారి కుమార్తె ప్రభావతీదేవితో)	19.5.1952
5.	ఆంధ్ర కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శి	1956–58
6.	బందరు నుండి పార్లమెంటుకు ఎన్నిక	1957–62
7.	కృష్ణాజిల్లా పరిషత్ ఉపాధ్యక్ష పదవి	1963–69
8.	అవనిగడ్డలో గాంధీక్షేత్రం ప్రారంభం	1969, అక్టోబరు
9.	అవనిగడ్డ సమితి అధ్యక్షులుగా ఏకగ్రీవ ఎన్నిక ఆగ్నేయాసియా దేశాల పర్యటన	1970
10.	అవనిగడ్డ నుండి శాసనసభకు ఏకగ్రీవ ఎన్నిక సాంఘిక సంక్షేమ మంత్రి పదవి	1972, ఫిబ్రవరి
11.	5 ఎకరాల భూదానం	30.06.1973
12.	విద్యాశాఖా మంత్రిగా ప్రమాణస్వీకారం	12.1.1974
13.	అధికార భాషగా తాలూకా స్థాయిలో ప్రకటన అఖిల భారత సాంస్కృతికోత్సవాలు	1974, ఉగాది
14.	బాలలకు ఉత్సవాలు	1974, దసరా
15.	మొదటి ప్రపంచ తెలుగు మహాసభలు	12.4.1975 నుండి వారం రోజులు
16.	50వ జన్మదినోత్సవం	4.8.1975
17.	అంతర్జాతీయ తెలుగు సంస్థ ఆవిర్భావం	6.9.1975
18.	దివిసీమ మహా ప్రళయంలో ఆపన్నహస్తం	1977 నవంబరు నుండి
19.	కృతజ్ఞతా విదేశయాత్ర	1983, అక్టోబరు
20.	మలేసియా పర్యటన, 'తెలుగు దాత' బిరుదు	1984, మార్చి
21.	మారిషస్ లో 3వ ప్రపంచ తెలుగు మహాసభలు	1990, డిసెంబరు
22.	పరమపదం	27.9.1997



మండలి వెంకట కృష్ణారావు

(1926 - 1997)

స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు ప్రప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించి విశ్వవ్యాప్తంగా ఉన్న తెలుగువారిని ఒకే వేదికపైకి తీసుకువచ్చారు. 'తెలుగుజాతి రత్నం'గా కీర్తింపబడినారు.

1977 నవంబరు 19న సంభవించిన ఉప్పెన – తుఫానులో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేసి 'ఆర్తజన బంధువు'గా కీర్తింపబడినారు. మరుభూమిగా మారిన దివిసీమను అచిరకాలంలోనే దివ్యసీమగా మార్చిన ఆధునిక దివిసీమ నిర్మాత ఆయన. 1968 – 1969లో గాంధీ జయంతి సందర్భంగా గాంధీక్షేత్రాన్ని నెలకొల్పి గాంధేయ నిర్మాణ కార్యక్రమాలకు కేంద్రంగా తీర్చిదిద్ది 'దివిసీమ గాంధీ'గా పేరుపొందారు.

మండలి కుటుంబ సభ్యులు వారి స్మారకార్థం 'మండలి ఫౌండేషన్' నెలకొల్పి లక్ష రూపాయల నగదు, జ్ఞాపికతో మండలి వెంకట కృష్ణారావు తెలుగు వైభవ పురస్కారాన్ని ప్రసిద్ధ తెలుగు ప్రముఖులకు అందజేయాలని నిర్ణయించి తొలి పురస్కారం 4-8-2018న 'స్వరాధిదేవత' శ్రీమతి పి. సుశీలకు ప్రదానంతో ప్రారంభించి కొనసాగిస్తున్నాం.